హనీబీ
సంపుటి 4, సంచిక 2
సెప్టెంబర్-అక్టోబర్ 2015

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

www.pallesrujana.org



## ఒకేసారి వేడిగాలి. చల్లగాలినిచ్చే ఫ్యాన్

## ఇంకా ఎన్నో.....






## స్క్రీన్ ప్రింటింగ్‌లో వినూత్న ప్రయోగం

## కరెంటు స్తంభాలెక్కడం సులువు

# సాంప్రదాయ పశువైద్యుడు 'బోయ పెద్ద రాజన్న'కు అశ్రు నివాళి



రాజన్న ఆత్మకు శాంతి కలగాలని హనీబీ నెట్‌వర్క్ ప్రార్థిస్తూ, ఆయన స్ఫూర్తిని, జ్ఞానాన్ని నలుదిశలా వ్యాపింపజేయాలని కోరుకుంటోంది. మనదేశంలోని నిస్వార్థ ఇన్నోవేటర్ల, గ్రామీణ వైద్యుల సేవలకి ప్రతిగా తగినంత చేశామా? హనీబీ నెట్‌వర్క్‌లో రాజన్నను గురించి వ్రాసే సంతాప సందేశంలో ఆయన రూపొందించిన వైద్య ప్రక్రియలని ఉదహరించటం అవసరమేమో. ఆయన నిస్వార్థ సేవలను కొనసాగించటానికి ఆయన స్ఫూర్తి మనకు తోడుగా ఉండుగాక.

**– ప్రొఫెసర్ అనిల్ కె. గుప్త,**
వ్యవస్థాపకుడు, హనీబీ నెట్‌వర్క్



**కీ.శే. బోయ పెద్ద రాజన్న, పశువుల మూలికా వైద్యుడు**

**రాష్ట్రపతి పురస్కారం (2012), హాల్ ఆఫ్ ఫేం, న్యూఢిల్లీ (2012)**

**మరణం : 6 అక్టోబర్, 2015**



రాజన్న ఆకస్మిక మరణం మమ్ములను దిగ్భ్రాంతికి గురి చేసింది. మా హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తున్నాం. పరమేశ్వరుడు ఈ దుఃఖ సమయంలో ఆయన కుటుంబానికి తగ్గ ధైర్యాన్ని ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను.

**– డా. విపిన్ కుమార్**
డైరెక్టర్ & చీఫ్ ఇన్నోవేషన్ అధికారి, ఎన్ఐఎఫ్.

నా ప్రగాఢ సానుభూతిని రాజన్న కుటుంబానికి అందజేయగలరు.

**– పి. వివేకానందన్,**
'సేవ' సంస్థ, మధురై, తమిళనాడు.

రాజన్న ఆకస్మిక మరణంతో పల్లెసృజన దిగ్భ్రాంతికి గురైంది. 4–5 రోజుల పాటు అనారోగ్యంతో ఆస్పత్రిలో వున్నా, మంచి ఆసుపత్రి సౌకర్యాలు కూడా ఆయన్ను మనకు దక్కించలేకపోయాయి. అక్టోబర్ 6 నాడు దివంగతులైనారు. తన జీవితమంతా 'మూగ జీవాల కోసం' కృషి చేసిన రాజన్న పశువుల వ్యాధులను తగ్గించటానికి మూలికలతో ఎన్నో ప్రయోగాలు చేశారు. దాదాపు 20 రకాల పశువుల వ్యాధులకు అద్భుతమైన మూలికా వైద్యం విజయవంతంగా చేసేవాడు. ఆయన తయారు చేసిన 'పొదుగువాపు' వ్యాధి మందును జాతీయ పరిశోధనా సంస్థ ధృవీకరించి, పేటెంటుకై దేశ విదేశాలలో దరఖాస్తు చేసింది. ఈ పొదుగువాపు వ్యాధి మందు తెలుగు రాష్ట్రాలలో ముమ్మరంగా వాడుతున్నారు. 2012 సం.లో ఎన్.ఐ.ఎఫ్. ద్వారా రాజన్న 'రాష్ట్రపతి పురస్కారం' స్వీకరించడం ఆయన జీవితంలో అత్యంత అరుదైన గౌరవం. ఈ పురస్కారంతో అనంతపురం జిల్లాలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆయనకు పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి. రాజన్న స్వతహాగా సరళమైన మనస్తత్వం కలవాడు, మానవతా వాది. తన జీవితమంతా ఏ ప్రతిఫలాన్ని ఆశించకుండా పశువులకోసం అన్నివేళలా కష్టపడ్డాడు. ఆయన ఆత్మశాంతి కోసం ఆ మూగ జీవాలన్నీ మూగగా భగవంతుడ్ని ప్రార్థిస్తున్నాయంటే అతిశయోక్తి కాదేమో. రాజన్న కుటుంబంలో ఆయన భార్య, ముగ్గురు వివాహితులైన కూతుర్లు, ఆరుగురు మనవళ్ళు, మనవరాండ్రు ఉన్నారు. ఈ కుటుంబానికి రాజన్న లేకుండా బ్రతికే ధైర్యాన్ని, శక్తిని భగవంతుడు ప్రసాదించాలని 'పల్లెసృజన' కోరుకుంటోంది. గత నాలుగు దశాబ్దాలుగా కంకణం కట్టుకుని సాధించిన మూగజీవాలకై చేసిన సేవను 'పల్లెసృజన' కొనసాగించాలని నిర్ణయించుకుంది. ఈ చిన్ని ప్రయత్నమే ఆయన నిస్వార్థంగా తన ప్రాంతంలోని మూగజీవాలకు చేసిన సేవకు పల్లెసృజన చేస్తున్న 'నివాళి'. రాజన్నా, మిమ్మల్ని మరువలేం. మీ ఆత్మకు భగవంతుడు పూర్తి శాంతిని ప్రసాదించాలని కోరుకుంటూ.... అశ్రు నయనాలతో ....

**7 అక్టోబర్, 2015**

**- 'పల్లెసృజన' బృందం.**

'పల్లెసృజన'తో రాజన్న అనుబంధానికి తార్కాణాలు.....

**2012లో రాష్ట్రపతి చేతులమీదుగా పురస్కారం స్వీకరిస్తున్న రాజన్న**



**2012లో 'హాల్ ఆఫ్ ఫేం' పురస్కారంతో రాజన్నకు అరుదైన జాతీయ సత్కారం**



# పల్లెస్పృజన

సంపుటి-4 సంచిక - 2

సెప్టెంబర్-అక్టోబర్ 2015

## ఈ సంచికలో...


- ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్) - 4
- స్తంభాలనెక్కేందుకు చెప్పులు - పాండురంగారావు సృజన - 5
- కొనిదెణ శ్రీనివాస్ వినూత్న ఇన్నోవేషన్‌లు - 9
- ఒక భారతీయ సగటు రైతు కథ - ధారావాహిక 2వ భాగం - 14
- 8వ జాతీయ ద్వైవార్షిక పోటీలు (2) - 18
- స్క్రీన్ ప్రింటింగ్‌లో పెయింటింగ్ లాంటి బొమ్మలు ముద్రిస్తున్న ప్రిన్స్ సత్యం - 25
- పల్లె జ్ఞానంతో పదిమందికి లాభం చేసిన పందిరి పుల్లారెడ్డ - 28
- పల్లెస్పృజన పరిచయంతో మారిన మహిపాల్ చారి జీవన గమనం - 29
- 'పల్లెస్పృజన' ప్రగతి - 31
- స్పందన - 32


కవర్ లోపలి పేజీల్లో ....

హనీబీ కథ

సాంప్రదాయ పశువైద్యుడు 'బోయ పెద్ద రాజన్న'కు అశ్రు నివాళి

మధ్య పేజీ :

అమ్మకానికి సిద్ధంగా వున్న 'పునాది స్థాయి ఇన్నోవేషన్లు'

ప్రతి పేజీలో

అబ్దుల్ కలాం గారి సూక్తులు

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
బ్రిగేడియర్
పోగుల గణేశం (రిటైర్డ్)

సంపాదకులు :
జమ్ములమడక శశిమోహన్

ఉప సంపాదకులు :
పల్లె వీర రాఘవ రెడ్డి

సలహాదారులు :
డా. కె.ఎల్. రావు
ప్రొ. అనిల్ గుప్త
డా. గీర్వాణి
శ్రీ పి. చంద్రకాంత్ శర్మ
జాగర్లమూడి దుర్గాప్రసాద్
శ్రీమతి అరుణ గణేశం
శ్రీ జమ్ములమడక శ్రీకర్

కార్టూన్లు :
వెంకట్

ఎడిటోరియల్ అడ్రస్ :
పల్లెస్పృజన, 102,
వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్.
పిన్- 500 094.
ఫోన్ :
040-27111959
98660 01678

E-mail :
editor@pallesrujana.org
www.pallesrujana.org

డి.టి.పి. & డిజైనింగ్ :
నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.
040- 40029002
81257 99904
E-mail :
narendragrafixhyd@gmail.com

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015.
Gujarat, India. Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
**Dr. Balaram Sahu,**
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
**Dr. T.N. Prakash**
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
**P. Vivekanandan,**
SEVA, 45, T.P.M.Nagar,
Virattipathu, Madurai - 625 010.
Tamil Nadu, India.
Phone: 0452 - 238 09 43(O), 0452- 238 36 19 ®
e-mail: vivekseva@gmail.com

**Loksarvani (Gujarati) and**
**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte**
**(Malayalam)**
**James T J,**
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by **Brig. Pogula Ganesham,** Owner and Printed at **M/s Narendra Graphics,** 1-5-1055/2/14, Flat No. 102, B. Block, Silver Springs Residency, Saibaba Nagar, Old Alwal, Secunderabad - 500 010. Ph.: 81257 99904 and Published at 102, Vayupuri, Sainikpuri Post, Secunderabad-500 094, A.P. Ph.: 040-27118555, Mobile : 098660 01678. Editor Sri J. Sesimohan.

# 'ధన' కేంద్రిక విధానాలు రైతుల పాలిట శాపమా?

తగినంత వర్షం లేకపోవటం అనేక విపరీతాలకి కారణమౌతోంది. పంటల నష్టాన్ని భరించలేక, చేసిన అప్పులను తీర్చే దారి కనిపించక, పెరుగుతున్న ఋణ భారాన్ని మోయలేక, అవమానాల దాడిని భరించలేక, అనుకున్నది సాధించలేక ఈ పరిస్థితులను ఎదుర్కోలేక ప్రాణత్యాగానికి సిద్ధమవుతున్నాడు రైతన్న. సూర్యునికి గ్రహణంలా, మన రైతు సోదరుల జీవితాలను అంధకారంలోకి త్రోసివేస్తున్న పరిస్థితులు ఈనాడు మనకు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ విపరీత పరిస్థితికి కారణాలేమిటి? బాధ్యులెవరు? వీటిని రాకుండా చూసే అవకాశముందా? భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు సంభవించకుండా ఏం చేయాలి? ఎలాంటి మార్పులు చేయాలి? ఎక్కడ మార్పులు చేయాలి? ఇలా ఎన్నో ప్రశ్నలు. వీటికి సమాధానాలు వెతకాలి. బహిరంగ చర్చలు జరగాలి. సమాజంలోని అన్ని వర్గాలు నిజాయితీతో, నిష్పక్షపాతంగా రైతుల బాధను పూర్తిగా అవగాహన చేసుకుని పరిష్కారాలు వెతకాలి.

దేశ పరిపాలనా విధానం, ఆర్థిక ప్రణాళికలు, శాస్త్రజ్ఞుల వైఫల్యాలు, టెక్నాలజీ తెచ్చిన బెడదలు, విత్తనాల లేమి, రాజకీయ నాయకుల దృక్పథంలో వ్యత్యాసాలు, దురాశలు, అవినీతిపూరిత ఆచరణలు, నైతిక విలువల పతనం, విద్యలో దిగజారుతున్న ప్రమాణాలు, ప్రజల మధ్య పెరుగుతున్న ఆర్థిక వ్యత్యాసం, సాంఘిక అన్యాయాలు, టీవీల వల్ల మారుతున్న ప్రజల ఆలోచనా తీరు, సెల్‌ఫోన్ ఆధారిత జీవితాలు, ధన మూలమైన జీవన సరళి, విదేశీ వ్యాపారస్తుల స్వార్థాలు, అంతర్జాతీయ రాజకీయ ఒత్తిడులు, తీవ్రవాదులు, నల్లధనులు, శరీర సౌఖ్యమే ఉద్దేశ్యంగా మారిన జీవన శైలి, ఇంటర్నెట్ దురుపయోగాలు, ఎస్ఎంఎస్‌లు, వాట్స్ యాప్ అతి వినియోగాలు, టచ్ స్క్రీన్‌లు, జీవితంలోని ప్రతి పనికి "యాప్"లు, ప్రకృతిపై నిర్లక్ష్యం, బీదలతో అహంకారపూరిత వ్యవహారం ఇలాంటివన్నీ చర్చల్లో భాగం కావాలి. కూలంకష, వృత్తాకార దృష్టి కోణంతో వచ్చే 50 సంవత్సరాల్లో రాబోయే పరిమాణామల దృష్ట్యా భవిష్యత్తులో అవలంభించవలసిన విధానాలు, రైతులను కష్టాల్లోకి తోసివేయని పథకాలు, సమాజంలో సమానత్వం దిశగా ఆచరణలు, పరస్పర సహకార భరిత సమాజ నిర్మాణానికి తోడ్పడేలా రూపొందించాలి. చిత్తశుద్ధితో అమలు చేయాలి. ఇదంతా ఆదర్శ పథం. సంభవం కాదేమో! అయితే ఆదర్శానికి అతి దగ్గరగా చేరి మన దేశాన్ని శాంతి, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయాలతో నిర్మించుకోవాలి. అందరూ అనుకుంటే చేయలేనిది, అసంభవమైనదేం కాదిది.

ప్రస్తుత పరిస్థితిని కొంత విశ్లేషించుకుందాం. మన గ్రామాలు 60 సంవత్సరాల క్రితం సమృద్ధిగా ఉండేవి. ప్రకృతితో సంయమనం, స్వావలంబన వీటి శక్తులు. సాంఘిక అత్యాచారాలు, నిరక్షరాస్యత లాంటివి ఎక్కువగా వున్నా, అవి వ్యవసాయదారుల్ని, వృత్తి పనులు చేసుకునేవారిని ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి దారి తీయలేదు.



'ధన మూలం ఇదం జగత్' ప్రతిదీ ధనంతో ముడిపడిపోయింది. డబ్బు లేకుండా ఏ పనీ చేయలేని పరిస్థితి వచ్చింది. అందుకే బ్యాంకింగ్ వ్యవస్థ మారుమూల పల్లెలకి కూడా పాకిపోతోంది. ప్రతి గ్రామీణుడి వద్దకు చేరుకోవడానికి ప్రయత్నిస్తోంది. డబ్బు లేకుంటే రైతుకు కావలసిన విత్తనాలు, ఎరువులు, కూలీలు, యంత్రాలు, డీజిలు, పెట్రోలు, రవాణా, వైద్యం, విద్య, బట్టలు, దేవుని దర్శనాలు.

**కష్టాలు నిన్నుసాధించటానికి రాలేదు.... నీ శక్తి సామర్థ్యాలను బయటకు తీసి నిన్ను నీవునిరూపించుకునేందుకే వచ్చాయి...**

పత్రికలు, టీవీలు, సెల్‌ఫోన్లు ఏవీ లభించవు. డబ్బు లేకుంటే ఒక్కరోజు కూడా గడవటం కష్టం. జీవనాధార వృత్తులు కూడా కొనసాగటం అసాధ్యమౌతోంది..... ఇది పరమ సత్యం.

పాత తరం సాంప్రదాయకంగా, డబ్బు లేకుండా జీవనాన్ని కొనసాగించింది. డబ్బే ప్రధానంగా గ్రామీణులు బ్రతికినట్లుగా చరిత్రలో సాక్ష్యాలు లేవు. కాని స్వర్ణ యుగాలు, శాంతియుత జీవన ప్రమాణాలు మనకు తెలిసిన భారత చరిత్రలో ఎన్నో ఉన్నాయి. డబ్బే ప్రధానంగా జీవించడం, డబ్బుకై రోజూ వెంపర్లాడటం గ్రామ ప్రజల రక్తంలో లేదు. అందుకే డబ్బే ప్రధామైపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో తల్లడిల్లుతున్నారు. ఈ డబ్బు భాష అర్థం కాక, డబ్బు లేని పరిస్థితులను ఎదుర్కొనే శక్తిని పెంచుకోలేక, డబ్బుతో, డబ్బును సంపాదించుకునే జ్ఞానం, అవకాశాలు తెలియక, చీకట్లో దారి వెతుకుతున్న వారిలా కొట్టుమిట్టాడుతున్నారు. అయోమయంలో మునిగిపోతున్నారు. అలవాటులేని పనిని సమర్థవంతంగా చేయలేక పోతున్నారు. ప్రధానంగా ఈ వ్యత్యాసం రైతుల ప్రస్తుత పరిస్థితికి కారణం అనుకోవడంలో తప్పేమీ లేదు.

రైతు డబ్బు పండించడు. ధాన్యం పండిస్తాడు. చీరలు నేస్తాడు, చేపలు పడతాడు. వాటిని అమ్మి డబ్బు సంపాదిస్తాడు. అయితే తాను పండించిన ధాన్యాన్ని డబ్బుగా చేసుకోవడంలో ఆయనకు ప్రమేయమే లేదు. పెట్టుబడులకు ధనం కావాలి. విత్తనాలు, ఎరువులు, పశుగ్రాసం వగైరాల ధరలు రైతునిర్ణయించడు. పెట్టుబడులపై నియంత్రణ రైతుల చేతులనుంచి తప్పించేశాం. దిగుబడిపై కూడా ఆయనకు నియంత్రణ లేదు కారణం- ప్రకృతి వైపరీత్యాలు. కూలీల కొరత, పెరిగిన వ్యయం, యంత్రాల కిరాయి, వాటిఅందుబాటు, దిగుబడి, వాటి ధరలు..... ఇవన్నీ రైతుల చేతుల్లో లేవు. ఎక్కడైతే పెట్టుబడి నుండి దిగుబడి వరకు చేసేవాడి చేతుల్లో ఉండదో, ఆ పరిశ్రమ స్థిరంగా నిలబడలేదు. తప్పకుండా విఫలమవుతుంది. మన రైతుల పరిస్థితి ఇప్పుడు ఇలాగే ఉంది. వ్యవసాయం కష్టపడినా , నష్టపోయేలా తయారైంది. దీనికి బాధ్యులు రైతులు మాత్రమే కాదు.

రైతుల పరిస్థితి ఇలావుంటే, దీనికి విరుద్ధంగా విద్యావంతులు, ఉద్యోగులు, పారిశ్రామామికులు, ఉద్యోగపతులు డబ్బును నేరుగా సంపాదిస్తారు. డబ్బుతో కొంటారు, డబ్బును ఆదా చేసుకుంటారు. ప్రతి నెలా డబ్బు వస్తుంది, డబ్బుతో డబ్బు చేసుకుంటారు. వీరి జీవితాల్లో డబ్బు ప్రాధాన్యత మొదటినుండి ఉంది. డబ్బుతోనే ప్రారంభమై, దాంతోనే ముగుస్తుంది. డబ్బు లేకుండా ఎలా జీవించాలో వీరికి తెలియదు. ఎక్కువ డబ్బుంటే దేన్నయినా పొందవచ్చు అన్న ధీమా ఈ ద్రవ్యపూరిత జీవితాల్లో ఉన్న సత్యం. వీరికి డబ్బు ఎంతో అవలీలగా అర్థమవుతుంది. జీవితంలో, ఆలోచనల్లో, ఆచరణలో, చర్చల్లో అంతా డబ్బు మయమే. డబ్బుతో సహచర్యంవల్ల వీరు సౌకర్యవంతంగా సులభంగా జీవించగల్గుతున్నారు.

రైతులు అలా కాదు. వారి జీవితాలు, పరిసరాలు, అలవాట్లు, అవసరాలు, సంప్రదాయ జ్ఞానం, ఇదో డబ్బులేని లోకం. అయితే ఈ సత్యాన్ని మనం గ్రహించక, వారికి తెలియని పద్ధతులను, వారిపై రుద్ది, కష్టాల్లోకి నెట్టకుండా, వారి బలహీనతలను మనకు లాభకరంగా వాడుకోకూడదు. వారి శక్తులను, సామర్థ్యాలను, ప్రకృతితో వారికున్న సంయమనాన్ని గుర్తించి, వారిని మరింత బలోపేతం చేస్తూ, స్వావలంబనతో, వారి జీవన విధానాలను శాంతియుతంగా కొనసాగించుకునే సులభమైన ఆలోచనా క్రమాన్ని చూపించడం మనందరి బాధ్యత. గ్రామీణ ప్రజల ఆర్థిక బలహీనతలను వాడుకుంటూ మనం దేశాభివృద్ధిని సాధిస్తున్నామని గర్వపడటం, గర్హనీయం.

చివరగా ఒక్కమాట. "గ్రామస్తులు మనం లేకుండా బ్రతకగలరు. కాని, వారు లేకుండా మనం ఒక్కరోజు కూడా బ్రతకలేము". ఈ సత్యాన్ని గ్రహిస్తే చాలు.

ఈ సంచికలో 'ఎస్.ఆర్.వి.' కాన్సెప్ట్ పాఠకులతో పంచుకుంటున్నాం. దాన్ని లోతుగా అర్థం చేసుకుని, ఈ కాన్సెప్ట్ వెనకాల ఉన్న ఉద్దేశ్యాన్ని సాధించటానికి తోడ్పడతారని, తెలుగు గ్రామ ప్రజల జ్ఞానాన్ని విస్తారంగా ప్రజలందరికీ చేరటానికి పూర్తిగా కృషి చేస్తారని ఆశిస్తూ.... ప్రార్థిస్తూ....

భవదీయ

బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం

**వర్షం వచ్చినపుడు పక్షులన్నీ నీడను వెతుక్కుంటాయి కానీ గద్దలు వర్షానికి తడవకుండా మేఘాల పైనుంచి ప్రయాణిస్తాయి.**

# ఎన్.ఆర్.వి.

## (N.R.V.- Non Resident Villager)

నగరాల్లో, పట్టణాల్లో, ఇతర రాష్ట్రాల్లో, విదేశాలలో నివసిస్తున్న దాదాపు ప్రతి వ్యక్తి మూలం గ్రామీణ ప్రాంతంలోనే ప్రారంభమై వుంటుంది. మనకు కొత్తగా పరిచయమైన ఏ వ్యక్తి అయినా పరిచయ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వెంటనే అడిగే ప్రశ్న "మీదే ఊరు?" అని. మరి అలాంటి "మన ఊరు"కి మనమేదైనా చేయగలమా? అన్న ఆలోచనలోంచి పుట్టిందే "ఎన్.ఆర్.వి." (నాన్ రెసిడెంట్ విలేజర్) దృక్పథం.

మీరూ మీ 'ఊరు'కి ఏదైనా ఓ చిన్న కార్యక్రమం చేయాలనుకుంటున్నారా? అందుకు నాందిగా ముందుగా మీ ఊరికి అవసరమైన 'జ్ఞానాన్ని పంచండి'. అంతకంటే మంచిపని ఏముంటుంది. ఇందుకు మీరు చేయవలసిందల్లా "నలుగురు మీ ఊర్లోని వ్యక్తులను గుర్తించండి. వారినుండి ఒక్కొక్కరు కేవలం రూ. 200/–లు తీసుకుని, వాటికి మీ 200 రూపాయలు జోడించి 'పల్లెసృజన' పత్రికకు చందాగా పంపండి. ఐదు సంవత్సరాల పాటు మీ గ్రామానాకి ఈ పత్రిక ద్వారా ఇతర పల్లెల జ్ఞానం అందుతుంది.

ప్రతి గ్రామం లోను ఏవో 'సమస్య' లతో ఆ గ్రామీణులు కష్టపడుతూ వుంటారు. అయితే ఈ సమస్యలకు మరో గ్రామం లో 'పరిష్కారం' ఉండ వచ్చు. ఈ పరిష్కారాలు సమాంతరంగా అన్ని గ్రామాలకు అందజేయ టానికి 'పల్లెసృజన' తోడ్పడు తుంది. ఇలా ఒక గ్రామ సమస్యలకు పరిష్కారాలు తోడవటంతో గ్రామాల ప్రజలు తమ జీవన భృతిని నిరాఘాటంగా చేసుకునే వెసులుబాటు కలుగుతుందని మా విశ్వాసం.

> మీ ఊరిని ఇతర గ్రామాల జ్ఞానంతో కలపడమే 'ఎన్.ఆర్.వి. కాన్సెప్ట్'... లేవండి.. మీ ఊరి అయిదుగురు ఎన్.ఆర్.వి.లను గుర్తించి తలా రూ. 200/–లు సేకరించి 'పల్లెసృజన'కు 5 సంవత్సరాల చందా కట్టండి. మీ గ్రామానికి అమూల్యమైన సేవ చేయండి.



'పల్లెసృజన' పత్రిక మీ సహకారంతో మీ ఊరికి వెళుతుం దంటే మీకు కూడా సంతృప్తిగానే ఉంటుంది. నేను మా ఊరికి ఓ జ్ఞానాన్ని అందిస్తున్నాను అనే ఆనందం మీ మనసులో నిండుకుంటుంది. దీనివల్ల మీకు ఖర్చయ్యేది కేవలం రూ. 200/–లు మాత్రమే. ఇక ఆలస్యమెందుకు, మీరే మీ ఊరి 'ఎన్.ఆర్.వి.' నాయకుడిగా ఏర్పడి మీ తోటి వారిని నలుగురిని ఓ గుంపుగా చేసుకుని మీ మార్గదర్శకత్వంలో మీ ఊరికి 'పల్లెసృజన' అందేలా చూడండి. గ్రామీణ వికాసానికి జ్ఞాన దివ్వెలను ప్రసరింపజేస్తున్న పత్రిక ద్వారా మీ ఊర్లో కూడా లభిస్తున్న కొన్ని సమస్యల పరిష్కారాలు మాకు అందడం ద్వారా వాటిని మరో గ్రామంలోని సమాజం ఉపయోగించుకునే అవకాశం కల్పించండి.

మీరు చేయవలసిందల్లా 'ఐదు మంది ఓ గుంపుగా ఏర్పడి ప్రతి వ్యక్తి రూ. 200/–లు అంటే మొత్తం రూ. 1,000/–లను పల్లెసృజనకు పంపండి. ఐదు సంవత్సరాల పాటు మీ ఊరికి 'పల్లెసృజన' పత్రిక పంపబడుతుంది. మీరు చందా పంపేముందు మీ గుంపులోని ఐదు మంది పేర్లు, వారి ఫోన్ నెంబర్లు, మీ ఊరి చిరునామా పంపడం మరవకండి. మీ చందాను క్రింద వివరించిన 'బ్యాంకులో డిపాజిట్ చేసి, మీ వివరాలు ఎస్ఎంఎస్/ మెయిల్ ద్వారా తెలియ జేయండి'. మా ఊరికి నేనో మంచి పని చేశాను అన్న తృప్తితో జీవించండి.

ఈ ఆలోచనను మీ తోటి మిత్రులతో పంచుకోండి. వారు కూడా 'ఎన్.ఆర్.వి.' గ్రూపులో భాగస్వాములు అయ్యేందుకు సహకరించండి. గ్రామీణ వికాసానికి గ్రామాల్లోనే పరిష్కారం ఉందని ఋజువు చేయండి. 30వేల తెలుగు గ్రామాలకు 'ఎన్.ఆర్.వి. కాన్సెప్ట్'తో "పల్లెసృజన" పత్రిక త్వరలో చేరుతుందని, మీ సహకారంతో తప్పకుండా మాకల నిజమవుతుందని ప్రగాఢంగా

**మీ చందాను డిపాజిట్ చెయ్యవలసిన బ్యాంకు వివరాలు :**

**M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri Branch, Secunderabad.**
**S.B. A/c No. 30232200019150, IFS Code : SYNB0003023**

**మీ చిరునామా/ వివరాలను పంపవలసిన చిరునామా :**

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ – 500 094. ఫోన్ : 040–27111959, సెల్ : 9866 00 1678
**E-mail : president@pallesrujana.org, Visit us at : www.pallesrujana.org**

**నేను గెలవాలి అని గట్టిగా నిర్ధారించుకుంటే ఎప్పటికీ ఓడిపోవు.**

# ఇన్నోవేటర్ పాండు రంగారావు మరో సృజన



# స్తంభాలనెక్కేందుకు చెప్పులు

ఒక 'ఆవిష్కరణ' జరగటానికి కొందరు వ్యక్తులు కారణం కావచ్చు, కొన్ని సంఘటనలు కారణం కావచ్చు, కొన్ని బాధలు కూడా కారణం కావచ్చు. అలాంటి కోవకు చెందినదే 'పల్లెసృజన' పాఠకులకు గతంలో పరిచయమైన మెదక్ జిల్లా, కంగ్టి మండలంలోని మారుమూల గ్రామమైన 'సుక్కలతీర్థ' గ్రామవాసి "కంటాలి పాండురంగారావు". 2014 మార్చి–ఏప్రిల్ సంచికలో పాండురంగారావు తయారు చేసిన 'టైర్లు పంచర్ కాకుండా ఉండేందుకు ఒక రసాయనం' మీకందరికీ గుర్తుండే ఉంటుంది. గ్రామీణ స్థాయినుండి వచ్చిన మోటార్ సైకిల్ మెకానిక్ కాబట్టి గ్రామీణుల సాధక బాధకాలను గమనించి నాడు తయారు చేసిన 'ట్యూబులకు పంచర్ కాకుండా నిరోధించే రసాయనం' నేడు కార్యరూపం దాల్చి ఇప్పటికే ఎన్నో వేల ట్యూబులను విక్రయించడం కూడా జరిగింది. తన ప్రధాన వృత్తికి ప్రత్యామ్నాయంగా ఇప్పుడు ఈ ట్యూబుల వ్యాపారం కొనసాగుతోంది.

స్వతహాగా సృజనాత్మకత కలిగిన వ్యక్తి అయిన పాండు రంగారావుకు ఈమధ్యనే మరో 'ఇన్నోవేషన్' తయారు చేసే సంఘటన ఒకటి జరిగింది. తన మిత్రుడు ఒకతను కేబుల్ టీవీలో పనిచేస్తుండేవాడు. ఒకరోజు వర్షం పడుతుండగా ఊర్లోని కేబుల్ వినియోగదారులలు తమ టీవీ సరిగా రావటం లేదనటంతో కరెంటు పోల్‌కు నిచ్చెన వేసుకుని పైనున్న కేబుల్ టీవీ వైర్‌కు అతుకు పెట్టే పనిలో నిమగ్నమై వున్నాడు. ఆ నిచ్చెనను కదలకుండా పట్టుకున్న మరో సహాయకుడు కాస్త ఏమరుపాటుగా ఉండటంతో అసలే వర్షం పడి బురదగా వున్న నేల కావటంతో నిచ్చెన జారటం వల్ల పైనుండి తన మిత్రుడు క్రింద పడటంతో అతని కాలు విరిగింది.

ఆ తర్వాత కొన్ని రోజులకు అతని ఇంటికి వెళ్ళి పలకరించి వద్దామని వెళ్ళాడు పాండురంగారావు. అతను ఇ,ట్లోనే మంచంపై ఉండటం చూసి 'ఏంటిరా, ఇప్పుడేం చేస్తున్నావు, ఎలా వుంది నీ పరిస్థితి అని అడగ్గా, కాలు విరిగిన నేనేం చేయగలను ఖాళీగా ఇంట్లో ఉండటం తప్ప, ఏదైనా నాకు తగిన పని దొరకక పోదా అని ఆలోచిస్తూ ఇంట్లోనే ఉంటున్నాను అన్నాడు.

రోజు ఏదో ఒక పని చేసుకుంటే కాని కుటుంబం గడవని ఈరోజుల్లో ఒక వ్యక్తి మంచాన పడివుండటం అంటే కొద్దిగా బాధ అనిపించింది పాండురంగారావుకి. మళ్ళీ

**మనిషికి జీవితంలో కష్టాలు కూడా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలోనే సుఖాలను గురించి ఆలోచిస్తాడు.**




ఇంకొక కార్మికుడికి ఇలాంటి పరిస్థితి రాకూడదు అని, ఈ సమస్యలకు ఏదైనా పరిష్కారం ఆలోచించాలని నిర్ణయించుకున్నాడు. అగ్రికల్చరల్ బి.ఎస్సీ చదివిన తన మరో మిత్రుడు శ్రీకాంత్ తో కలిసి ఈ విషయమై చర్చించి దీనికో పరిష్కారం కనుగొనాలి అనుకున్నారిద్దరూ. అనుకున్నదే తడవుగా తీవ్రంగా ఆలోచించి ఓ పరిష్కారం తోచడంతో అనుకున్న సాధనం తయారు చేశారు ఇద్దరు మిత్రులు.

తాము తయారు చేసిన సాధనాన్ని ప్రయోగించి చూశారు. అందులోని కొన్ని ఇబ్బందులను గుర్తించి మరో సాధనానికి ఆ ఇబ్బందులు రాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆ తర్వాత ఇంకోటి, మరోటి ఇలా దాదాపు 15 సార్లు మార్పులు చేర్పులు చేసి చూశారు. తాము చేసిన ప్రతి డిజైన్‌లోని లోపాలను చాలా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కేటపుడు ఒక్కోసారి జారిపోయేది, అది ఎందుకు జారిపోతుంది, ఇలా జారకుండా ఉండటానికి ఏం చేస్తే బావుంటుంది లాంటి ఎన్నో తమ ప్రశ్నలకు తామే జవాబులు కనుగొన్నారు. పరికరంలోని ఏ భాగం ఎన్ని మిల్లీ మీటర్ల పొడవుండాలి? ఎన్ని డిగ్రీల ఒంపుతో వుండాలి లాంటి ఎన్నో వందల ప్రశ్నలు తమ మస్తిష్కంలో మెదిలడం, వాటికి పరిష్కారాలను తామే కనుగొని మొత్తానికి సంపూర్ణమైన ఒక పరికరం ఒక సంవత్సరంలో తయారు చేయడం జరిగింది.

అనుకున్న విధంగా అన్ని సమస్యలకు పరిష్కారంగా పరికరమైతే తయారైంది కానీ ఓ చిన్న సమస్య వారిని వేధించ సాగింది. ఇది దాదాపు ఒక్కో కాలికి తొడిగే 'చెప్పు లేదా బూటు లాంటి పరికరం' ఒక్కోటి ఒకటిన్నర కిలోలు ఉంది. అంత బరువు మోయటం కొద్దిగా ఇబ్బందికరమైన విషయం. దీనికి కూడా పరిష్కారం కనుగొంటే బావుంటుంది కదా అని ఆలోచించాడు పాండురంగారావు. ఇక్కడ రెండు విషయాలు బాగా ఆలోచించాడు. మొదటిది దాదాపు 100 కిలోల మనిషి బరువును మోయగలగాలి, స్తంభం ఎక్కిన తర్వాత అక్కడ కనీసం అరగంట పని చేయాల్సిన అవసరం వచ్చినా, స్థిరంగా నిలబడ్డ మనిషి బరువుకు వంగ కూడదు..... మనిషి ఒక్కోసారి రెండు కాళ్ళపై నిలబడటం కాస్త ఇబ్బంది అయినప్పుడు ఒక కాలుపై ఎక్కువ భారం వేసి నిలబడి పని చేసుకోవటం పరిపాటి అలాంటప్పుడు ఒకే కాలుపై భారం ఎక్కువ అవుతుంది..... ఇలాంటి సమస్యలన్ని ఆలోచించి ఆ పరికరలో అనవసరమైన కొంత బరువును తగ్గించి మొత్తానికి పూర్తి స్థాయి నమూనాను 750 గ్రాములతో తయారు చేయగలిగాడు.

మనం నడిచేటపుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటామో (యాదృశ్చికంగానే) అలాంటి జాగ్రత్తలు తీసుకోవటం మినహా వీటిని ధరించి ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరమేమీ లేదంటాడు పాండురంగారావు. మామూలుగా నడిచేటప్పుడు, అలాగే నిచ్చెన ఎక్కేటప్పుడు ఒక కాలు తీసి మరో అడుగు వేస్తాము. అలాంటప్పుడు కూడా మరో అడుగు వేయబోయే కాలికున్న ఈ పరికరం కూడా ఊడిపోయే సమస్యే లేదంటాడితను. తాను స్వయంగా ఎలాంటి విద్యుత్తు వైర్లు లేని పోలును కూడా చివరి అంచుదాకా ఎక్కి చూశాడు. మామూలుగా సిమెంటు



**సూర్యుడిలా వెలగాలి అనుకుంటే ముందు సూర్యుడిలా కాలడం నేర్చుకో.**

కరెంటు స్తంభం మొదలు లావుగా పైకి వెళ్ళేకొద్దీ సన్నబడుతూ వుంటుంది. అయినా సరే ఈ సాధనంతో చివరి అంచుదాకా వెళ్ళి ప్రయోగాత్మకంగా పరీక్షించాడు. ప్రస్తుతం సిమెంటు విద్యుత్ స్తంభాలలో మూడు రకాల స్తంభాలు ఉన్నాయని, ఒక్కో స్తంభాన్ని ఎక్కేటందుకు ఒక్కో రకమైన పరికరం కాకుండా ఎలాంటి స్తంభాన్నయినా ఎక్క గలిగేటందుకు అనుకూలంగా ఉండేలా ఒక పరికరాన్ని రూపొందించాడు.

దాదాపు 18 రకాల పరికరాలు, 25 నుండి 30 కిలోల ఇనుము వాడిన తర్వాత ఈ పరిపూర్ణ పరికరం తయారైంది. వృధా అయిన ఇనుమును కూడా తుక్కు క్రింద అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు పాండు రంగారావు, అది వేరే విషయం. కానీ, ఇంత ఓపికతో, ఇంత పట్టుదలతో తాను తయారు చేసిన పరికరం ఎంతోమంది విద్యుత్తు కార్మికులు, కేబుల్ టీవీ కార్మికులు, ఇంటర్‌నెట్ కేబుల్ కార్మికులు లాంటి ఎందరివో జీవితాలకు సంపూర్ణ ఆనందాన్ని, క్షేమాన్ని, నమ్మకాన్ని కలిగిస్తుందన్న ఆనందం అతని కళ్ళలో తొణికిసలాడింది. భవిష్యత్తులో తన మిత్రుడిలాగా ప్రమాదవశాత్తు కాలువిరిగి ఇంట్లో నిస్పృహతో ఎవ్వరూ ఉండరన్న విశ్వాసం కల్గింది.

మామూలుగా ఇనుప కడ్డీని వంచవచ్చు కానీ, అలా వంచినట్లయితే అందులో తగినంత దృఢత్వం ఉండదు కాబట్టి ఈ పరికరంలోని చిన్న చిన్న వంపులను కూడా వేడిమీదనే చేయటం జరిగిందని, అలా చేస్తేనే ఆ వంపు చేసిన చోట శక్తి సన్నగిల్లకుండా ఉంటుంది అంటాడు పాండురంగారావు. వీటికి చెప్పుల మాదిరిగా ప్లేట్లు అమర్చి





ఉంటాయని, వాటి ధరించే వ్యక్తి తాము చెప్పులు వేసుకునైనా, బూట్లు వేసుకునైనా లేదా ఉత్త కాళ్ళతోనైనా సరే వీటిని ధరించి మామూలుగా వాడుకోవచ్చు ఆ పరికరాని కున్న బెల్టును బిగించుకుంటే చాలు అంటాడు.

అంతటితో ఆగక ఆ పరికరాన్ని అతి భయస్తుడు, రాత్రిపూట బైటకు వెళ్ళాలంటే కూడా భయపడే తన బావగారితోనే ప్రయోగాత్మకంగా వాడి చూడటంతో ఈ సాధనంపై తనకెలాంటి భయమూ లేదని, ఎవ్వరైనా సరే నిర్భయంగా వినియోగించుకోవచ్చునని అంటాడు పాండురంగారావు.

ప్రస్తుతం మనమందరం గమనిస్తునే వుంటాము. దాదాపు ప్రతి విద్యుత్తు శాఖ లైన్‌మెన్, ప్రతి కేబల్ ఆపరేటర్, తప్పకుండా సిమెంటు స్తంభాలను ఎక్కే పని చేయవలసి వుంటుంది. అలాంటప్పుడు పైకి స్తంభం ఎక్కే మనిషికి తోడు క్రింద నిచ్చెనను పట్టుకునేందుకు మరో వ్యక్తి కూడా అవసరమే. అయినా నిచ్చెన పట్టుకున్న వ్యక్తి అజాగ్రత్త

ఒకరిని ఓడించడం చాలా సులువు, మరొకర్ని గెలుచుకోవటమే చాలా కష్టం.

వహిస్తే పైనున్న వ్యక్తి ప్రమాదానికి గురి కాక తప్పదు. ఈ రెండు సమస్యలకు ఒకే పరిష్కారం ఆలోచించాడు పాండురంగారావు. ఒకే వ్యక్తి ఈ సాధనాన్ని ధరించి సిమెంటు స్తంభాలను అధిరోహించవచ్చు. క్రింద సహకరించడానికి మరో వ్యక్తి అవసరం లేదు. మరో ముఖ్యమైన విషయం తాను ఏదైనా ప్రమాద వశాత్తు క్రింద పడతానేమోనన్న భయం అంతకన్నా లేదు.

మొత్తానికి పాండురంగారావు కనుగొన్న ఈ పరికరం కూలీల ఖర్చును మిగల్చడంతో పాటు, వ్యక్తి ప్రమాదాలను కూడా ఖచ్చితంగా అరికట్టగలగడం ఎంతో ప్రశంసనీయం. ఇలాంటి సాధనం కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని ఎన్నో లక్షల మంది, దేశ వ్యాప్తంగా ఎన్నో కోట్లమంది విద్యుత్, కేబుల్, ఇంటర్‌నెట్ రంగాలకు చెందిన కార్మికుల జీవితాలను ప్రమాదాల నుంచి కాపాడుతుంది అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎంతోమంది కార్మిక వర్గాల వారు ఇలాంటి సాధనం కోసం ఎదురు చూస్తున్నారు అనటంలో ఎలాంటి సందేహం లేదు. ఇంతటి మహత్తరమైన పని చేయగల, నమ్మకాన్ని అందించగల ఈ పరికరం ఖరీదు కేవలం రూ. 350లకు మించదు అంటాడు పాండు రంగారావు. అంటే కార్మికులకు అందరికీ అందుబాటులో లభించే ఈ అద్భుతమైన, సృజనాత్మకమైన ఈ పరికరం అనతి కాలంలోనే అనేక మంది ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకోవటమే కాదు, మన ఇన్నోవేటర్ పాండురంగారావుకు కూడా మంచి పేరు, ప్రఖ్యాతులను ఆర్జించి పెడుతుందని విశ్వసిస్తోంది 'పల్లెసృజన'.

పాండురంగ తయారు చేసిన ఈ స్థంభాలు ఎక్కే సాధనం దేశవ్యాప్తంగా అందుబాటులో ఉండేలా చేయాలంటే పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. మంచి మార్కెట్ పద్ధతులు, ఇంజనీరింగ్ ప్రావీణ్యంతో ఉత్పాదన చేసి నాణ్యమైన ఈ సాధనం కోట్లమందికి అతి స్వల్ప కాలంలో అందుబాటులోకి వచ్చి భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేలా తోడ్పడటానికి పారిశ్రామికవేత్తలు 'పల్లెసృజన'తో సంప్రదింపులు జరిపేందుకు ముందుకు వస్తారని ఆశిస్తోంది. ●

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

**దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.**

**హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి. ముందుగా మా కార్యాలయానికి సమాచారాన్ని అందించినట్లయితే, మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.**



విక్రం రాథోడ్ సైకిల్ పంపు




రోషన్‌లాల్ విశ్వకర్మ చెరుకు కణుపులను కత్తిరించే సాధనం





గోపాల్ భీసే సైకిల్ నాగలి





మల్లేష్ సోలార్ స్ప్రేయర్, లైటు ఫ్యాన్ల రిమోట్

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2,
వాయుపురి, సైనిక్‌పురి పోస్టు,
సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700.

అందరికీ సమానమైన ప్రతిభ ఉండకపోవచ్చు కానీ ప్రతిభను పెంచుకునే అవకాశాలు అందరికీ సమానమే.

# కొనిదెణ శ్రీనివాస్ వినూత్న ఇన్నోవేషన్‌లు



మనం మన దినచర్యలో భాగంగా అనేక పనులు చేస్తూ వుంటాం. ఆ పనులకి అనేక రకాల వస్తువులు వాడుతూ వుండొచ్చు. మనం వాడుతున్న వస్తువులు కానీ, ఆ పనులను వేరే వస్తువులతో కూడా చేయవచ్చునన్న ఆలోచన కానీ, మనం వాడుతున్న వస్తువులనే వేరే పనులకి కూడా వాడవచ్చునన్న ఆలోచన కానీ వుంటే దాన్ని ఆచరణలో పెడితే అవే 'ఇన్నోవేషన్లు' అవుతాయి. కొందరు, ఇది పెద్ద విశేషమేమీ కాదని అనుకుంటారు. కానీ, కొందరు ప్రత్యేకమైన వ్యక్తులు మాత్రం తాము చేస్తున్న పనిలోంచే మరో వస్తువు పుట్టుకు రావటానికి నిరంతరం ఆలోచిస్తూ, ఓ వస్తువు రూపకల్పన చేయటానికి ఎప్పుడూ ప్రయత్నిస్తునే వుంటారు. అలాంటి కోవకు చెందిన వాడే "కొనిదెణ శ్రీనివాస్".

ప్రకాశం జిల్లా, ముండ్లమూరి మండలం లోని మారెల్ల గ్రామానికి చెందిన సాధారణ రైతు హన్మంత రావు, సుబ్బరత్నం దంపతుల ఏకైక పుత్రుడు కొణిదెల శ్రీనివాస్. ఇతనికి ఒక అక్క ఉంది. సాధారణ రైతు బిడ్డ కాబట్టి మామూలుగానే ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా పదవ తరగతి వరకు చదువుకుని, ఇక పై చదివే స్థోమత లేక, ఐటిఐలో ఎలక్ట్రికల్ కోర్సులో చేరాడు. అది కూడా పూర్తి చేయలేక మధ్యలో మానివేశాడు. ఐటిఐలో నేర్చుకున్న కాస్త ఎలక్ట్రికల్ పరిజ్ఞానంతో ఊర్లో చిన్న చిన్న గృహాల కరెంటు పనులను చేసి కొంత అనుభవం సంపాదించిన శ్రీనివాస్ ఇక్కడ పని లాభసాటిగా ఉండదని పది సంవత్సరాల క్రితం హైదరాబాద్ కు తన మకాంను మార్చాడు. కొంత కాలం హైదరాబాద్‌లో ఒక వ్యక్తి దగ్గర ఎలక్ట్రికల్ పని చేస్తూ ఇంకా ఏదైనా మంచి పనితనమున్న విద్యలో ప్రావీణ్యం సాధించి మెరుగైన సంపాదన ఉండేలా చూసుకోవాలని కలలు కన్నాడు.


**మీ ప్రమేయం లేకుండా మీరు ఏదీ సాధించలేరు. మీ ప్రమేయమే ఉంటే ఎప్పటికీ ఓడిపోలేరు.**

ఆ ఆలోచనల్లోనే ఎలక్ట్రికల్ పనులకు బదులు ఎలక్ట్రానిక్ పనులు నేర్చుకుంటే బావుంటుంది కదా అనుకుని కరెంటు పనులు చేసుకుంటూనే కంప్యూటర్ హార్డ్‌వేర్ (మెకానిజం) నేర్చుకోవటం మొదలు పెట్టాడు. ఆ విద్య పూర్తయిన వెంటనే కొన్నిచోట్ల సహాయకునిగా పని చేసి బాగా అనుభవం వచ్చిన తర్వాత హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ ప్రదేశమైన అమీర్ పేటలో ఒక దుకాణం అద్దెకు తీసుకుని తానే స్వంతంగా "శాప్ కంప్యూటర్ హార్డ్‌వేర్" అనే షాపును ఏర్పరచుకున్నాడు.

స్వంత షాపు, రద్దీ అయిన పరిసరాలు కాబట్టి షాపు బాగానే జరుగుతోంది. తీరిక లేకుండా పనిచేస్తున్నా తాను చేస్తున్న పనిలో ఒకింత ప్రత్యేకతను చొప్పించాలనే తృష్ణతో అనతి కాలంలోనే మంచిపేరు సంపాదించు కున్నాడు శ్రీనివాస్. కంప్యూటర్లను బాగా మరమ్మతు చేయడమే కాదు, ప్రతి పని నిశితంగా చేయడం వల్ల ఏ వస్తువు సామర్థ్యం ఏమిటి? అది చేసే పని ఎలాంటిది అని ఆలోచించి ఆ వస్తువును గురించిన క్షుణ్ణమైన పరిశీలన చేసే అలవాటు చేసుకున్నాడు. ఆ అలవాటులోంచే కొత్త సాధనాలకు రూపకల్పన చేయగలిగాడు శ్రీనివాస్.

**ఒకవైపు చల్లటి గాలి, మరోవైపు వెచ్చటి గాలిని వీచే ఫ్యాన్:**

కంప్యూటర్ లో ప్రధానంగా పని చేసేది "ప్రాసెసర్". కంప్యూటర్ 'ఆన్' అయిన క్షణం నుంచి 'ఆఫ్' చేసే వరకు నిరంతరంగా పనిచేసేది. ఇంత పని చేసేటప్పుడు అది అలసిపోవటం పరిపాటే కదా. అందుకని ఆ ప్రాసెసర్






ఎంత పని చేసినా వేడెక్కకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు దాన్ని చల్లబర్చడానికి ఒక "చిప్"ను, దానిపైన ఒక ఫ్యాన్‌ను బిగించడం ద్వారా ఆ చిప్ వేడిమిని బైటకు తరిమేస్తూ వుంటుంది. తద్వారా 'ప్రాసెసర్'ను ఎప్పటికప్పుడు చల్లబడుతూ వుంటుంది.

ఈ చిప్‌కు విడిగా విద్యుత్ సరఫరా (డిసి విద్యుత్) అందించినట్లయితే అది ఒకవైపు అత్యంత చల్లగా వుంటుంది. అది ఎంత చల్లగా వుంటుందంటే దాదాపు మనం ఐసుగడ్డపైన చెయ్యి పెట్టినట్లుగానే వుంటుంది. ఈ చిప్‌కు మరో వైపు వేడిగా వుంటుంది. దాన్ని ముట్టుకోవటం కొంచెం కష్టమే. అంటే చిప్‌కు ఒకవైపున చల్లదనాన్ని ఇవ్వటం కోసం అందులోని వేడిమిని అంతటినీ మరో వైపుకు పంపుతుంది.

దీన్ని గమనించిన శ్రీనివాస్ చిప్‌లోని చల్లదనం వున్న వైపును 'ప్రాసెసర్' పైన వుంచితే అందులోని చల్లదనం వల్ల ప్రాసెసర్ వేడి కాకుండా వుంటుంది. అలాగే మరోవైపు వచ్చే వేడిమిని దానికి అతికించిన ఫ్యాన్ ద్వారా బైటకు పంపుతుంది. అంటే ఈ చిప్‌కు రెండువైలా రెండు ఫ్యాన్‌లు అతికిస్తే ఒకవైపు వేడి గాలి, మరోవైపు చల్లటి గాలి సోకుతుంది కదా అని ఆలోచించాడు. ఈ విషయం దాదాపు కంప్యూటర్‌లను మరమ్మతు చేసే అందరికీ తెలుసు. కానీ ప్రయోగాత్మకంగా చేసి చూపించాడు శ్రీనివాస రావు. ఇప్పుడితను తయారు చేసింది కంప్యూటర్‌లలో

**మీరు మీ కర్తవ్యానికి సెల్యూట్ చేస్తే ఇంకెవరికీ సెల్యూట్ చెయ్యవలసిన అవసరం లేదు.**
**కానీ మీరు మీ కర్తవ్యాన్ని పొల్యూట్ చేస్తే అందరికీ సెల్యూట్ చెయ్యాల్సి వస్తుంది.**



వినియోగించే చిన్న ఫ్యాన్‌ను, ఒక చిప్‌ను మరికొన్ని తీసివేసిన వ్యర్థ భాగాలు మాత్రమే. కానీ, ఈ చిప్‌ను ఇంకొంచెం పెద్దదిగా తయారు చేసుకుని పెద్ద ఫ్యాన్‌లను బిగిస్తే గదికి తగినంత గాలిని కూడా సరఫరా చేయగలను అంటాడు శ్రీనివాస్. అంతేకాదు, ఈ ఫ్యాన్‌కు ఒక చిన్న స్విచ్‌ను ఏర్పాటు చేయటం ద్వారా చలికాలం గదిలోకి వేడిగాలి వచ్చేట్లుగా, బయటకు చల్లటి గాలి వెళ్ళేటట్లుగా కూడా ఏర్పాటు చేయవచ్చు అంటున్నాడు.

ప్రస్తుతం అందరు ఇళ్ళల్లో వాడే ఎయిర్ కండిషన్ మిషన్లు గదిలోకి కేవలం చల్లగాలిని మాత్రమే వదిలి గదిని చల్లబరుస్తాయి. ఒకవేళ చలికాలం వచ్చిందంటే ఎసి ఆఫ్ చేసుకోవాల్సి వస్తుంది. అయినా ఒక్కోసారి చలి విపరీతంగా వున్నపుడు గదిలోకి వేడి గాలి వచ్చి వెచ్చగా పడుకోవటానికి వీలు లేదు. ఇవి కేవలం ఎయిర్ కూలర్‌లు మాత్రమే తప్ప ఎయిర్ కండిషన్‌లు కాదని అంటాడు శ్రీనివాస్. కానీ తాను తయారు చేసిన ఈ సాధనం "సరియైన ఎయిర్ కండిషన్" అంటాడు. గదిలో వెచ్చగా వుండాలనుకుంటే కేవలం ఈ యంత్రానికున్న ఒక స్విచ్ నొక్కితే చాలు వెచ్చగా పడుకోవచ్చు అంటాడీయన.

ప్రస్తుతం మనకు అందుబాటులో వున్న ఎయిర్ కండీషన్లు ఖరీదులో విపరీతమైనవే కాకుండా, దానికి అయ్యే విద్యుత్ ఖర్చు కూడా చాలా ఎక్కువ. అంతేకాదు ఇది ప్రధానంగా గ్యాస్ కంప్రెషర్‌తో పని చేస్తుంది కాబట్టి గ్యాస్ అయిపోయిన వెంటనే నింపుకోవాలి. ఇది కూడా అదనపు ఖర్చే. కానీ తాను తయారు చేసిన ఈ యంత్రానికి ఎలాంటి మెయింటెనెన్స్ ఖర్చు లేదు, ఖరీదూ తక్కువగా వుంటుంది, విద్యుత్ ఖర్చు కూడా నామమాత్రంగా వుంటుంది అంటాడు శ్రీనివాస్.

**వస్తువులను గాలి మరియు బ్రష్‌తో శుభ్రం చేసే పరికరం:**

పూర్వం ఏదైనా ఒక వస్తువుకు దుమ్ము, ధూళి అంటినట్లయితే దాన్ని శుభ్రం చేయడం కోసం పెద్ద వస్తువైతే చీపురుతోను, సూక్ష్మమైన వస్తువైతే బ్రష్‌తోనూ శుభ్రం చేసి ఇంకా ఏమైనా దుమ్ము, ధూళి మిగిలి వుందేమోనని నోటితో ఊదేవారు. ఆధునిక పరిజ్ఞానం తోడవటంతో వాటిని 'బ్లోయర్' ద్వారా శుభ్రం చేసి, ఆపైన ఒక బ్రష్‌తో తుడిచి మళ్ళీ బ్లోయర్ ద్వారా ధూళిని శుభ్రం చేయడం జరుగుతుంది

కానీ, వినూత్న ఒరవడులకు రూపకల్పనలు చేసే మన ఇన్నోవేటర్ శ్రీనివాస్ మాత్రం రెండు పనులనూ ఒకేసారి చేసేలా ఓ సులభమైన పరికరాన్ని తయారు చేశాడు.

చేతితో పనిచేసే చిన్న బ్లోయర్‌ను తీసుకుని దాని మొదట్లో ఒక బ్రష్‌ను అమర్చి, ఆ బ్రష్ అడుగు భాగాన ఒక చిన్న రంధ్రాన్ని చేయడంతో తాను రిపేరు చేయాల్సిన కంప్యూటర్ మదర్ బోర్డులపైనున్న ధూళిని శుభ్రం చేస్తున్నాడు. దానివల్ల బ్రష్‌తో శుభ్రం చేయటంతో పాటు, గాలి కూడా వీస్తుండటంతో రెండు పనులూ ఒకేసారి అయిపోతున్నాయి.

ఈ పరికరాన్ని ఎవరైనా తయారు చేసుకోవచ్చు. కానీ, ఇలా కూడా చేసుకోవచ్చని నిరూపించాడు కొణిదెల



**కేవలం విజయగాథలు చదివితే వివరాలు మాత్రమే తెలుస్తాయి. అదే అపజయాల కథలు చదివితే విజయాలకి మార్గం దొరుకుతుంది.**

శ్రీనివాస్. ఈ పరికరాన్ని చూస్తే ప్రతి ఒక్క 'కంప్యూటర్ హార్డ్‌వేర్ ఇంజనీర్' దీన్ని తయారు చేసుకోవచ్చు. అలా తయారు చేసుకున్న ప్రతి హార్డ్‌వేర్ ఇంజనీర్ ఒక్కసారి శ్రీనివాస్‌ను మననం చేసుకుంటే చాలు అతని ఆలోచనను అభినందించినట్లే.

**తక్కువ నీటితో ఎక్కువ చల్లదనాన్నిచ్చే వాటర్ కూలర్:**

మామూలు కూలర్లు గదిలోకి చల్లదనాన్ని పంపడంతో పాటు నీటి తుంపరలను కూడా చిమ్ముతూ వుంటాయి ఇటువంటి కూలర్లను కంప్యూటర్ గదిలో అమర్చుకోవటానికి చాలామంది అంగీకరించరు. దానికి కారణం. ఈ కూలర్ ద్వారా విడుదలయ్యే నీటి తుంపరలు కంప్యూటర్ పైన పడటం వల్ల తేమ శాతం పెరిగి అవి పాడైపోతాయేమన్న భయం. ఈ విషయ పరిజ్ఞానమున్న శ్రీనివాస్ దీనికి విరుగుడుగా గదిలోకి చల్లటి గాలి రావాలే కాని, నీటి తుంపరలు రాకుండా ఉండాలని ఒక కూలర్‌ను తయారు చేశాడు. దీన్ని కంప్యూటర్ రూముల్లో కూడా ఎసికి ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. దీన్ని వాడటం వల్ల గదిలోకి ఎలాంటి నీటి తుంపరలు రావు, గది దాదాపు ఎసి మిషన్ ఉన్నట్లుగానే వుంటుంది. గడచిన వేసవి కాలంలో ఇది అద్భుతంగా పని చేయటంతో, వచ్చే వేసవి కాలంలో సరియైన సహకారం లభిస్తే పెద్దయెత్తున తయారు చేసి సమాజానికి అందించాలని ఉవ్విళ్ళూరుతున్నాడు.




**సన్నటి అక్షరాలు/ వస్తువులను చూసేందుకు భూతద్దం:**

ముద్రణా రంగంలో కలర్ ప్రింటింగ్ ప్రెస్ వారు ముద్రించబడ్డ కలర్లు సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకునేందుకు వినియోగించే బూతద్దాన్ని (హైగ్లాస్) తనకు అనుకూలంగా మలుకున్నాడు శ్రీనివాస్. ఆ బూతద్దానికి ఒక చిన్న ఎల్ఇడి బల్బును అమర్చి, అది వెలిగేందుకు కంప్యూటర్లలో వాడే 'సీమాస్' బ్యాటరీని అనుసంధానం చేశాడు. కంప్యూటర్ మదర్ బోర్డులో వున్న అతి సన్నని వస్తువులైన రెసిస్టర్ లాంటి వాటిపై ఇమిడివున్న వస్తువులను, వాటిపై గల అక్షరాలను చూసేందుకు దీన్ని వినియోగించుకుంటున్నాడు. ఈ భూతద్దం చూడటానికి చాలామంది వాడుతారు కానీ, అందులో కూడా తనకు కావలసిన విధంగా చూసుకునేం దుకు ఒక లైటు అమర్చుకోవటం ఇతని ప్రత్యేకత. దీనికి వినియోగించిన బ్యాటరీ కూడా కనీసం ఒక సంవత్సరం పాటు తప్పకుండా పని చేస్తుంది అంటాడు శ్రీనివాస్.

అంతేకాదు 'ద్విచక్ర వాహనాల్లో పెట్రోలు దొంగతనానికి గురి కాకుండా ఉండేందుకు ఒక పరికరం,



దేశంలో చాలా తెలివైన వారు పాఠశాల గదుల్లో చివరి బెంచీలో కూర్చువారై ఉండొచ్చు.



పెట్రోలు అయిపోయినపుడు కనీసం ఒక పది కిలోమీటర్ల దూరం ప్రయాణించేలా మరో పరికరాన్ని తయారు చేసే పనిలో నిమగ్నమై ఉన్నాడు శ్రీనివాస్. వ్యాపార పరంగా తానెంత బిజీగా వున్నా, తన సృజనాత్మక పరిశీలనను మాత్రం విడువని శ్రీనివాస్ ద్వారా ఇంకా ఎన్నో సమాజానికి ఉపయోగపడే ఇన్నోవేషన్లు రావాలని ఆశిద్దాం.

తాను చేస్తున్న జీవనాధార వ్యాపకంలోనే తనకు తోచిన ఆలోచనలకు రూపం అందిస్తూ సరికొత్త ఇన్నోవేషన్లను రూపొందిస్తున్న కొణెదల శ్రీనివాస్ అభినందించకుండా ఉండలేకపోయింది 'పల్లెసృజన' ఇతని ఆలోచనలను సమాజానికి అందించటానికి శాయశక్తులా కృషి చేయాలని సంకల్పించుకున్నాడు పల్లెసృజన అధ్యక్షులు శ్రీ బ్రిగేడియర్ గణేశం గారు. అతి త్వరలో ఇతని ఆలోచనలు వస్తురూపంలో సమాజానికి అందుబాటులోకి వచ్చేలా శాయశక్తులా కృషి చేస్తోంది 'పల్లెసృజన'. ●

**శ్రీనివాస్ ఫోన్ నెం. 98858 30160**

# NIF లో మీకు అవసరమైన ఇన్నోవేషన్‌ల అన్వేషణ

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ గత 14 యేళ్ళుగా సేకరించిన గ్రామీణ ఇన్నోవేషన్లు, సాంప్రదాయ జ్ఞానం ప్రజలందరికీ అందుబాటులో వుండటానికై ఒక వెబ్‌సైట్ తయారు చేసింది. ఈ జ్ఞానమంతా వెబ్‌సైట్ www.nifindia.org లో చూడవచ్చు. అలాగే మీకు ఏ సమస్యకైనా పరిష్కారం ఈ జ్ఞానం కోశంలో వుందో లేదో తెలుసుకోవాలనుకుంటే

**NIF టోల్ ఫ్రీ నెంబర్ 1800 233 5555**

కు కూడా ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.
కానీ ఫోన్‌లో మాట్లాడాలనుకునేవారు
ఇంగ్లీషు లేదా హిందీలో మాత్రమే సంప్రదించవలసి వుంటుంది.

**తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇన్నోవేటర్లు తయారు చేసిన ఇన్నోవేషన్లు, 'పల్లెసృజన' చేస్తున్న కార్యక్రమాలను గురించి వివరంగా తెలుసుకునేందుకు www.pallesrujana.org వెబ్‌సైట్‌ను సందర్శించగలరు.**

నీవు నీ భవిష్యత్తుని మార్చుకోలేవు. కానీ నీ అలవాట్లను మార్చుకోగలవు. మారిన నీ అలవాట్లే నీ భవిష్యత్తుని మారుస్తాయి.

# ఒక భారతీయ సగటు రైతు కథ

ధారావాహికం రెండవ భాగం

- చల్లా కృష్ణారెడ్డి, గుంటూరు జిల్లా.

కొంత పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తే బాగుంటుందేమోననే ఆలోచన వచ్చింది. కానీ దానికి పెట్టుబడి కావాలి. అది మనదగ్గర లేదు కనుక మన పొలంలోనే వాణజ్య పంటలైన ప్రత్తి, మిరప లాంటివి వేస్తే రెండు ఎకరాలకు నేను పనికి పోయి సంపాదించిన డబ్బుతో పెట్టుబడి పెట్టి, ఆ పంటలపై ఎక్కువ ఫలసాయం తీసుకొనవచ్చు అనే ఆలోచనతో ఒక ఎకరం ప్రత్తి, ఒక ఎకరం మిరప తోట వేశాను. కొత్తగా అప్పుడే నాగార్జున సాగర్ కాలువ వదలటం జరిగి,ది. ప్రత్తి, మిరప తోటలు కూడా అప్పుడే కొత్తగా వేయడం మొదలు పెట్టారు. ఇంకొంతమంది నీరు పుష్కలంగా ఉంది కదా అని మాగాణి చేసిన నాట్లు కూడా వేస్తున్నారు.

నేనుమాత్రం ప్రత్తి, మిరప తోట వేశాను. అయితే ప్రత్తి మాత్రం ఒక రకంగా పెరిగి కాచింది. మిరప మాత్రం ఎంతకూ ఎదగలేదు. ఎన్నో మందు కట్టలు (ఎరువు సంచులు) వేసినప్పటికీ అది ఎదగనే లేదు. ఆ పొలంలో మిరప ఎదిగే పోషకాలు లేవు కాబోలు. మిరపలో ఎకరానికి 2000 రూపాయల దాకా నష్టం వచ్చింది. ప్రత్తి పంట పెట్టుబడికి, ఆదాయానికి సరిపోయింది. ఎందుకంటే పురుగు మందులు నకిలీవి అప్పుడు బాగా వస్తుండేవి. ఎంత మందు కొట్టినా ప్రత్తిలో పురుగు చావదు. చెట్టు ఎదుగుతుంది, పూత వస్తుంది, ఆ పూత పురుగు తినటం వల్ల రాలిపోతుండేది. ఎన్ని మందులు కొట్టినా పురుగు చావదు. ఆ క్రమంలో ఆ సంవత్సరం కొంత ప్రత్తి పంటలో వచ్చిన ఆదాయం, మిరప తోటలో వచ్చిన నష్టాన్ని నా కూలీతో భర్తీ చేసి బయట పడ్డాను. మరుసటి సంవత్సరం మళ్ళీ ప్రత్తి మిరప వేశాను.

ఈ సంవత్సరం కొంత మంచి విత్తనాలను ఎక్కువ పెట్టుబడి పెట్టి వేశాను. ఆ రెండు ఎకరాల్లోనే, కౌలు పొలం జోలికి పోలేదు. నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల కారణంగా పెట్టుబడి ఎక్కువైంది. పైరు పెంచ గలిగాను, పంట పండించగలిగాను కానీ ఫలం మాత్రం దక్కలేదు. ఆ వచ్చిన పంటకూ పెట్టుబడికీ సరిపోనే వచ్చింది. ఇదిలా వుంటే నాకు పిల్లవాడు పుట్టాడు. నా భార్య చంటిబిడ్డ తల్లి గనుక పొలం పనులకు వెళ్ళలేక పోయింది. ఇంటి ఖర్చులు పెరిగిపోయినవి. పెట్టుబడికోసం అప్పు తెచ్చిన డబ్బుల్లో కొంత ఇంటి ఖర్చులకు వాడుకోవటం జరుగుతోంది. పండించిన పంటకు సరియైన ధర లేకపోవటం వల్ల పంట చేతికి వచ్చే సరికి ధర సగానికి సగం తగ్గిపోయేది. అప్పుడు మిరప కాయలు రేటు బాగా హెచ్చు తగ్గులు జరుగుతుండేవి. ఒకసారి క్వింటాలు రూ. 3,000/–ల దాకా అమ్మితే, మరోసారి రూ. 500/–లకు దిగివచ్చేది. అలా అంత హెచ్చు తగ్గుల కారణంగా రైతు పూర్తిగా నష్టపోవటం జరుగుతూ వచ్చింది. పురుగు మందులు, ఎరువులు మాత్రం ఎప్పుడూ ఒకే రీతిగా అమ్మేవాళ్ళు. కాకపోతే పది, ఇరవై రూపాయల తేడా మాత్రమే ఉండేది.



**నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది, సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది, ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి, జ్ఞానం మిమ్ములను గొప్పవాళ్ళను చేస్తుంది.**

ఆ క్రమంలో కొంత అప్పు చేసి, ఆ అప్పు తీర్చటానికి నేను కట్టుకున్న సొంత పూరి ఇంటిని అమ్మివేసి బాకీలు తీర్చటం జరిగింది. భార్యనూ వాళ్ళ అమ్మగారి ఇంటికి పంపి, నాయనను మా అన్నదగ్గరకు పంపించాను. ఇక ఒంటరినై పోయాను. ఏదో సాధించాలి, ఆ దిశగా నాకు గురువు ఎవరున్నారనే ఆలోచన మొదలైంది.

మా బంధువు ఒకాయన పుట్టపర్తి సత్యసాయి బాబా దగ్గరికి వెళ్ళి వస్తూ ఉండేవాడు. ఆయన దగ్గరికి వెళ్ళి బాబా గారి శక్తులను గురించి విచారించాను. పుట్టపర్తి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. నాలో స్వతంత్ర భావాలు, విమర్శనా ధోరణి, పరిశీలనా గుణం కలిగిన ఒక స్నేహితునితో పరిచయం అయింది. అతను బాబా గారితో కొన్నిరోజుల ముందు బాగా సన్నిహితంగా కలిసి తిరిగినవాడు. ఆయన ద్వారా బాబాగారి విషయాలు తెసుకోవటం మొదలు పెట్టాను. పుట్టపర్తికి చేరుకున్నాను.

ఆయన విభూది అరచేతినుంచి తీసి ఇవ్వటం, పటిక బెల్లం ముక్కలు సృష్టించి భక్తులపైకి విసరటం, ఒక రూపాయి, రెండు రూపాయల నోట్లు బుట్టలలో పోసుకొని కొంతమంది ఆయనను చూడటానికి వచ్చిన పేదవారికి పిరికిళ్ళలో పోసి దానం చేయటం చూస్తున్నాను.

ఆయన ప్రవర్తన, ఆయన చర్యలు నాకు అనుమానాస్పదంగా ఉన్నవి. నిజంగా దేవుడే అయితే ఇవన్నీ చేయవలసిన అవసరం ఉన్నదా? రాత్రిళ్ళు బాగా దగ్గుతో బాధపడుతున్నాడు. తన అద్భుత శక్తిని నిరూపించు కోవటానికి ఏదైనా కలకాలం నిలిచి ఉండునట్లు సైంటిస్టు చెయ్యలేని ఒక పనిముట్టు తయారు చెయ్యవచ్చు, లేదా ఒక భవనమును నిర్మించి గాలిలో వేలాడుతూ ఏ ఆధారం లేకుండా నిలిచి ఉండేటట్లు చూపించవచ్చు. దానిని ఎందరు సైంటిస్టులైనా పరిశీలించుకునే విధంగా అవకాశం ఇచ్చి అలా మరింకెవరూ (భౌతికవాదులు) చెయ్యలేని విధంగా నిర్మించి ప్రజలకు అద్భుత శక్తి ఉన్న దేవుడు అని నిరూపించటానికి ప్రయత్నించవచ్చు. అలా కాకుండా బజారులో గారడీ వాళ్ళు చేయు పనులు చేస్తూ ఇవి అద్భుత శక్తిద్వారా వచ్చినవి, నేను అద్భుత శక్తి కలిగి వున్నాను అని చెప్పుకుంటూ డబ్బు కుప్పలు కుప్పలుగా కూడవేసుకుంటూ సర్వ సుఖాలు అనుభవిస్తూ ఖరీదైన జీవితాన్ని అనుభవిస్తూ కార్లు, విమానాలు వాడుకొని, ఎసి గదుల్లో కాలం గడుపుతూ కేవలం పచ్చి భౌతిక వాదులుగా వారి ప్రవర్తన కొనసాగుతున్నది. ఈయన మంచివాడా, చెడ్డవాడా? కనుగొనటం ఎలా? ఆయనను ఒక కత్తితో పొడిచి చంపేదానికి పూనుకుంటే (భక్తుల సమూహంలోకి వచ్చినప్పుడు) అప్పుడు ఆయన నిజమైన శక్తి కలిగిన బాబా అయితే నా చర్యను, నా ఆలోచనను పసిగట్టగలుగుతాడు తనను తాను కాపాడుకోగలుగుతాడు. నేను అలా కత్తితో పొడవటానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోతుంది. ఆయన నిజమైన వాడు కానియెడల ఆయన నా కత్తిపోటుకు చనిపోవడం జరుగుతుంది. అప్పుడు నన్ను పోలీసులు హింసించడం, జైళ్ళలో పెట్టడం ఇదంతా గందరగోళంగా అనిపించింది. ఈ ఆలోచన సరికాదు. మరేదయినా ఆలోచించాలి అనుకున్నాను. ఆ ప్రయత్నం మానుకొన్నాను. మరేమి చెయ్యాలి? నా ప్రయత్నం వల్ల ఇతరులకు హాని కలగ కూడదు. నాకు హాని కలిగినా ఫర్వాలేదు, నిజం తెలుసుకోగలిగితే చాలు, అని ఒక నిర్ణయానికి వచ్చాను. నావద్ద ఉన్న డబ్బులు అయిపోయేంత వరకు ఇక్కడ ఆయనను పరిశీలిస్తూ ఉంటాను. నావద్ద డబ్బులు ఎప్పుడు అయిపోతాయో అప్పుడు నేను ఆత్మహత్యా ప్రయత్నం చేస్తాను. అది భగవంతుని సమక్షంలో 'నిజ' దేవుడు మన పూర్వీకులు చెప్పినట్లు సర్వాంతర్యామియైన దేవుడు అంతటా చూస్తున్నాడు. అన్నీ తెలుసుకోగలడు. ఏదైనా చేయగలడు. సర్వం ఆయన చేతుల్లోనే నడుస్తున్నది అని చెప్పుచున్నారు కదా. ఈ బాబా నిజమైన దేవుడైతే తప్పక ఆయన సమక్షం లోనే నేనీ పని చేయబోవుచున్నాను గనుక తప్పకుండా నన్ను రక్షిస్తాడు. లేకుంటే ఆయన ఒకవేళ నకిలీ బాబా అయితే 'నిజ' దేవుడు ఉన్నాడు గదా ఆయన నన్ను రక్షిస్తాడు. ఇది నేను అప్పటికప్పుడు ఆ క్షణంలో తీసుకున్న నిర్ణయం కాదు. ఒక పదిరోజులు ముందుగానే దేవునికి విన్నవించుకున్నాను. ఏం జరుగుతుందో చూద్దాం అనుకుంటూ పది రోజులు గడిపాను.

(సశేషం)

**మీ కలలను సాకారం చేసుకోవాలంటే మీరు ముందు కలలు కనాలి.**

# 'పల్లెసృజన' కార్యాలయంలో అమ్మకానికి సిద్ధంగా వున్న "పునాది స్థాయి ఇన్నోవేషన్‌లు"



## మహిపాల్ కల్టివేటర్

రైతులకు అనుకూలమైన వ్యవసాయ పనిముట్లు తయారు చేయగలిగితే గ్రామాల్లోనే పట్టణాలకంటే బాగా బ్రతుకుతెరువు వుంటుంది. అని నమ్మి రైతులకు అవసరమైన పనిముట్లు, అదీ సామాన్య రైతులకు అందుబాటులో వుండేలా తయారు చేయాలన్న సంకల్పంతో తయారైందే ఈ "చేతితో నడిపే కల్టివేటర్" ఇక ప్రతి చిన్న రైతూ తన సేద్యాన్ని ఇతరులపై ఆధారపడకుండా చేసుకునే వీలు కల్పిస్తున్నాడు ఇన్నోవేటర్ 'మహిపాల్ చారి'. వందలాది రైతులు దీన్ని ఆనందంగా వాడుతున్నారు. ఒక హెక్టారు పొలాన్ని రెండున్నర గంటల్లో కేవలం మూడున్నర లీటర్ల డీజిల్ ఖర్చుతో సేద్యం చేయవచ్చు. ప్రత్తి, పొగాకు, మిరప లాంటి పంట పొలాల్లో అంతర సేద్యానికి కూడా చాలా అనుకూలమైనది.

భారత రాష్ట్రపతి పురస్కారం గైకొన్న ఈ ఇన్నోవేటర్ 'మహిపాల్ చారి' దీన్నే కాక, 'శ్రీవరి'లో కలుపు తీసేందుకు ఒక చిన్న యంత్రాన్ని, 'తెల్ల కుసుమ' పూతను సేకరించేందుకు మరో పరికరాన్ని కూడా తయారు చేశాడు. ఇతని ఇన్నోవేషన్లన్నీ సామాన్య రైతుకు అందుబాటు ధరలో లభించేవే.



## వీధి లైట్ల కంట్రోలర్

చాలాచోట్ల వీధిలైట్లు పగలు కూడా వెలుగుతూ వుండటం మనం గమనిస్తుంటాం. అలా వెలగటం వల్ల విద్యుత్ వృధా అవుతుంది. ఈవృధా ఉభయ రాష్ట్రల్లో కొన్ని కోట్ల రూపాయల నష్టాన్ని తెస్తుందని అధికారులే చెప్తున్నారు.

ఈ వృధాను అరికట్టేందుకు వీధిలైట్లు "రాత్రి అవగానే వెలిగి, తిరిగి సూర్యోదయం కాగానే ఆరిపోయేలా" ముప్పారపు రాజు 'వీధిలైట్ల నియంత్రణ పరికరం' తయారు చేశాడు. దీంతో అనవసరంగా విద్యుత్తు వృధా కాకుండా ఆదా చేసుకోవచ్చు.

ఈ పరికరాలను ఇప్పటికే వరంగల్ జిల్లాలోని 16 గ్రామాలు (దుగ్గొండి మండలం) 22 పారిశ్రామిక సంస్థలు, 10 పోలీస్ స్టేషన్ (నర్సంపేట సబ్‌డివిజన్) లలో అమర్చాడు. ఇవి ఇప్పటికీ విజయవంతంగా పనిచేస్తూ ఎంతో విద్యుత్‌ను ఆదా చేస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు ఈ పంరికరం తయారు చేసిన ముప్పారపు రాజును అభినందించి, వీటిని అన్ని గ్రామాలు, పట్టణాల్లోని వీధిలైట్లకు అమర్చేందుకు కృషి చేస్తామన్నారు.



## లైట్లు, ఫ్యాన్ రిమోట్ & సోలార్ స్ప్రేయర్

అనారోగ్యంతో తన తల్లి మంచంమీద నుంచి లేవలేక లైట్లు, ఫ్యాను వేసుకోలేని పరిస్థితిని అధిగ మించేందుకు ఆమెకొరకు తయారు చేసిన లైట్లు ఫ్యాన్ రిమోట్. చాలామంది వృద్ధులకు ఇది అందుబాటు ధరలో సౌకర్యవంతంగా ఉంటుంది. దీని సహాయం తో 4 బల్బులు, ఒక ఫ్యాన్‌ను పనిచేయించవచ్చు.

తన సృజనాత్మకతను అంతటితో ఆపకుండా రైతులకు ఎలాంటి ఖర్చు లేకుండా పురుగు మందును పిచికారి చేసేందుకు అందుబాటు ధరలో 'సోలార్ స్ప్రేయర్'ను రూపొందించాడు. ఇది దాదాపు 'పవర్ స్ప్రేయర్'కు సమానమైన వేగంతో మందును పిచికారి చేస్తుంది. ఎటువంటి ఇంధన ఖర్చు అవసరం లేదు. ఎలాంటి శబ్ద కాలుష్యం కూడా ఉండదు. బరువు కూడా పవర్ స్ప్రేయర్‌కన్నా చాలా తక్కువగా వుంటుంది. ఎలాంటి నిర్వహణా ఖర్చు ఉండదు.



## వినూత్న గాలిమర

కుటుంబ పరిస్థితుల దృష్ట్యా పాఠశాల చదువు మధ్యలోనే ఆపి టీవీ మెకానిక్‌గా చేరాడు. అనుభవం నేర్పిన పాఠాలతో రైతులను కంరెంటు కష్టాల నుండి బయటపడేయటానికి ఒక పరిష్కారం కనుగొనాలని కలలు కన్నాడు.

ఆ కలల ప్రతిరూపమే నేడు తయారైన 'గాలిమర'. ఎటువైపునుండి గాలి వచ్చినా ఒకే దిశలో తిరిగేలా గాలిమరను అద్భుతంగా తయారు చేసిన 'పటాన్ సైదా' ఒక సాధారణ గ్రామీణ ఇన్నోవేటర్. చిన్న గాలి వీచినా సరే ఇది తిరుగుతునే వుంటుంది. మామూలు గాలిమరల్లా ఇది ఎంతో ఎత్తున ఉంచాల్సిన అవసరం లేదు. తక్కువ ఎత్తులో వున్న ఈ గాలిమర 30 అడుగుల లోతునుంచి నీటిని కరెంటు, డీజిల్ లాంటి ఏవిధమైన ఖర్చూ లేకుండా, ఎవరిమీద ఆధార పడకుండా రోజుకు 15 వేల లీటర్ల నీటిని తోడుతోంది.

<u>ఇవే కాక ఇంకా ఎన్నో ఇన్నోవేషన్లు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. కావలసినవారు సంప్రదించవలసిన చిరునామా :</u>

**క్రియేటివ్ మైండ్స్**
**67, రోడ్ నెం. 2, వాయుపురి, సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.**
**ఫోన్ : 040–27111959, సెల్ : 96528 01700.**

# 8వ జాతీయ ద్వైవార్షిక పోటీలు
# బహుమతి పొందిన ఇన్నోవేషన్లు - ఇన్నోవేటర్ల వివరాలు

2వ భాగం




**జాతీయ ప్రథమ బహుమతి (మొక్కలు) :**

**"సితార శృంగార్" అనే అభివృద్ధి చేయబడిన ఆవాలు రకం:**

**హుకుంసింగ్ లోధా, భరత్‌పూర్, రాజస్థాన్**



62 సంవత్సరాల హుకుంసింగ్ రాజస్థాన్‌లోని భారత్‌పూర్ ప్రాంతంలో ఒక ఆదర్శ రైతు. ఈయన స్వంతంగా ప్రయోగాలు చేసి "సితార శృంగార్" పేరిట 'ఆవాల' హైబ్రిడ్ రకాన్ని రూపొందించాడు. ఈ రకం చీడ పీడలను తట్టుకోవటమే కాక ఎక్కువ నూనెను ఇచ్చే గుణం కూడా కలిగి వుంది.

10వ తరగతి పాసైన తర్వాత ఈయన తన తండ్రి పొలంలో సాంప్రదాయ పద్ధతిలో పశువులు, సాధారణ పరికరాలు ఉపయోగించి, వ్యవసాయం చేయడం ప్రారంభించాడు. భరత్‌పూర్ లోని వ్యవసాయ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందిన తర్వాత ఆధునిక పరికరాలు, వ్యవసాయ పద్ధతులను వాడటం ప్రారంభించాడు. ఫలితం బాగుండటంతో ఉత్సాహంగా అనేక వ్యవసాయ ప్రదర్శనలు, శిక్షణా కేంద్రాలను సందర్శించాడు. ఫలితంగా తన పొలంలో సాంప్రదాయ పద్ధతులలో పండించే 'ఆవాల' పంటను ఆధునీకరించాలని నిశ్చయించుకున్నాడు. భరత్‌పూర్ లోని 'ఆవాల ఆధునీకరణ' ప్రయోగశాల ఇతనికెంతో స్ఫూర్తినిచ్చింది. ఇతనికి భార్య, ఇద్దరు కూతుళ్ళు, నలుగురు కుమారులు ఉన్నారు.

హుకుంసింగ్ తన పొలంలో చుట్టుప్రక్కల అందరు

**కలలు అనేవి నిద్రలో వచ్చేవి కాదు. కలలు అనేవి మీకు నిద్ర లేకుండా చేసేవి.**



రైతులు సాగుచేసే పద్ధతిలో ఆవాలు పండించేవాడు. దాంతోపాటు పెద్దపెద్ద గింజలున్న మరో రకం ఆవాలను కూడా వేరుగా పండించేవాడు. ఈ రకం నీటియెద్దడిని కూడా తట్టుకుంటుంది. 2005వ సంవత్సరంలో తన స్వంత ఆలోచనతో తాను పండించే రెండు రకాల ఆవాలను విడివిడిగా కాక, పక్క పక్క వరుసలలో పండించడం ప్రారంభించాడు. పంట గింజలు తీసే సమయంలో అతను రెండు రకాలను కలిపి బాగా ఏపుగా పెరిగిన చెట్లను ఎంచుకుని వాటి విత్తనాలను ప్రత్యేకంగా సేకరించాడు. వాటితో తర్వాతి సంవత్సరం పంట వేశాడు. ఈవిధంగా మూడు, నాలుగు పర్యాయాలు చేసిన తర్వాత 2010వ సంవత్సరంలో చీడపీడలను తట్టుకొని ఏపుగా పెరిగి మంచి నాణ్యమైన గింజలతో అధిక దిగుబడిని సాధించాడు. వీటికి అతను 'శితార శృంగార్' అని నామకరణం చేసి విత్తనాలను అభివృద్ధి చేయడం ప్రారంభించాడు.

ఈ రకంయొక్క ప్రత్యేకత ఏమిటంటే, అధిక దిగుబడి (హెక్టారుకు 30–35 క్వింటాళ్ళు), అధిక నూనె దిగుబడి (42%), నీటిని కూడా తక్కువగా వాడుకోవటం, ఉప్పునీటితో కూడా సాగు చేసుకోవచ్చు.

జయ్‌పూర్ లోని రాజస్థాన్ వ్యవసాయ పరిశోధనా సంస్థ వారు ఈ రకంయొక్క సుగుణాలను ధృవీకరిస్తూ 'సాధారణంగా లభించే చాలా రకాలకన్నా ఇవి ఉత్తమమైనవి అన్నారు. హుకుంసింగ్ ఈ రకాన్ని 'పి.వి.వి. మరియు పి.ఆర్.' చట్టం క్రింద రిజిష్టర్ చేయించాడు. రాజస్థాన్ లోని భరత్‌పూర్, ధోల్‌పూర్, ఆల్వార్, దౌసా జిల్లాలలోని అనేక మంది రైతులకు ఈ విత్తనాలను అందజేశాడు. అందరూ ప్రత్యేకించి భారక్‌పూర్ ప్రాంత పరిసర రైతులు దిగుబడి చాలా బావుందని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

హుకుంసింగ్ సాధించిన ఈ విజయానికి గుర్తింపుగా ఉదయ్‌పూర్ లోని 'మహారాణా ప్రతాప్ వ్యవసాయ విశ్వవిద్యాలయం' వారు 'కిసాన్ దివస్' సందర్భంగా భారత రాష్ట్రపతి చేతులమీదుగా పురస్కారంతో సత్కరించారు. అదే సంవతసరం (2010లో) హిస్సార్ లోని 'హర్యానా వ్యవసాయ విశ్వ విద్యాలయం' వారు కూడా 'ఉత్తమ వ్యవసాయదారుడు' పురస్కారంతో సత్కరించారు.

హుకుంసింగ్ ఆ ప్రాంతపు ఆదర్శ రైతుగా వర్షపునీటి పరిరక్షణకై గత 30 సంవత్సరాల నుంచి పాటుపడుతూ తోటి రైతులను కూడా నీటి పరిరక్షణ చర్యలకై పాటుపడాలని కోరుతూ వుంటాడు. ఇతను గొట్టపు బావులను త్రవ్వించటం, మరమ్మత్తులు చేయటం, వర్షపు నీటిని నిలువ చేయటానికి భూమి లోపలే నీటి ట్యాంకులను ఏర్పాటు చేయటమే కాక, ఇతర రైతులకు కూడా ఏర్పాటు చేయటం లాంటి ఎన్నో సామాజిక కార్యక్రమాలను కూడా చేశాడు.

ఇరవై మంది బడుగు వర్గాలకు చెందిన పిల్లలకు పౌషికాహారం అందించటంతో పాటు, తోటి రైతుల పశువులకు రోగాలకు కూడా తక్కువ ధరలో మందులు సరఫరా చేస్తుంటాడు.

**జాతీయ రెండవ బహుమతి (వ్యవసాయ ఇంజనీరింగ్) :**

**పుట్టగొడుగుల వ్యవసాయానికి కంపోస్టు తయారు చేసే యంత్రం:**

**జితేందర్ మల్లిక్, పానిపత్, హర్యానా**



37 సంవత్సరాల జితేందర్ మల్లిక్ హర్యానా ప్రాంతం లోని పానిపత్ కు చెందిన యువ రైతు. పుట్టగొడుగుల వ్యవసాయంలో వాడే కంపోస్టు ఎరువును తయారు చేయటం ఎక్కువ సమయం, ఎక్కువ మంది కూలీలు కలిసి ఎంతో శ్రమతో చేసే పని. దీనిని సులభతరం చేయాలని జితేందర్

**జీవితము - కాలము ప్రపంచంలో ఉత్తమమైన గురువులు.**
**జీవితం కాలాన్ని ఎలా సద్వినియోగం చెయ్యాలో చెప్తుంది. కాలం జీవితంలోని విలువలను నేర్పుతుంది.**



జితేందర్ 10వ తరగతి వరకు చదువుకున్నాడు. బాస్కెట్ బాల్ ఆడటమంటే ఇష్టం. ఎన్నో బహుమతులు గెలుచుకున్నాడు కూడా. చదువుకన్నా ఆటలమీద మక్కువ ఎక్కువ. చిన్నప్పుడు ఏదైనా బొమ్మ ఇస్తే దాంతో ఆడుకోవటం కన్నా దాన్ని విప్పదీసి ఎలా పనిచేస్తోందో తెలుసుకోవటం మీదే ఆసక్తి ఎక్కువగా ఉండేది వీడికి అంటుంది అతని తల్లి. అన్నల్లాగా చదువుకోరా అంటే వినేవాడు కాదట. యంత్రాల మీద నాకున్న శ్రద్ధ పుట్టగొడుగుల వ్యవసాయం చేపట్టిన తర్వాత నాకెంతో పనికి వచ్చింది అంటాడు జితేందర్.

1996లో హిమాచల్ ప్రదేశ్ లోని తన మేనమామ ఇంటికి వెళ్ళినపుడు అక్కడ ఈ పుట్టగొడుగుల వ్యవసాయం గురించి తెలుసుకున్నాడు. తిరిగి వచ్చిన తర్వాత తమ స్వంత భూమిలో పుట్టగొడుగులు పండించటం ప్రారంభించాడు. ఈ సాగులో ముందు ఒక షెడ్డును తయారు చేసుకోవాల్సి వుంటుంది. దానికై భూమికి గుంతలు త్రవ్వటం ఓ పెద్ద పని. ఈ గుంతలు చేసే పనివాడు గుంతలు సరిగా తీయకపోతే షెడ్డు, అందులోని అరలు సమానంగా లేక ఎగుడు దిగుడుగా వుంటుంది. 2002లో మొదటిసారి తాను పుట్టగొడుగుల సాగు ప్రారంభించినపుడు గుంటలు సరిగా తియ్యని కారణంగా షెడ్డు కూలిపోయి, పంట దిగుబడి సరిగా రాకపోగా నష్టం వాటిల్లింది. దాంతో భూమిలో గుంతలు సరియైన కొలతలతో, తగిన లోతులో తీసేలా ఒక యంత్రాన్ని తయారు చేశాడు. దీంతో అతని షెడ్డు వేసుకునే ఖర్చు కూడా తగ్గింది. 2006లో భూమిపైన ఎండిపోతున్న "కంపోస్టు ఎరువు తయారు చేసే యంత్రాన్ని" రూపొందించాడు. ఈ యంత్రం కంపోస్టు మిశ్రమాన్ని కలయబెట్టడం, అవసరమైనప్పుడు నీరు అందించడం, ఎరువు గడ్డలుగా వుండే పొడి చేయటమే కాక, చాలా త్వరగా కంపోస్టు ఎరువు తయారు చేయటానికి దోహద పడుతుంది.



జితేందర్ నివసించే 'సీంఖ్ గ్రామం' పాణిపత్, జింద్ జిల్లాల పొలిమేరల్లో వుంటుంది. ఆ ప్రాంత రైతులంతా గోధుమ, వరి, జొన్న, చెఱుకు పండిస్తూ వుంటారు. వారిలో ఒకే ఒక కుటుంబం 'పుట్టగొడుగుల' వ్యవసాయం చేస్తుండేది. ఆ ప్రక్రియను జితేందర్ ఆసక్తిగా కమనిస్తూ వుండేవాడు. జితేందర్‌ది ఉమ్మడి కుటుంబం. తల్లిదండ్రులు, ముగ్గురు అన్నదమ్ములు, వారి భార్యా పిల్లలతో, జితేందర్ అతని భార్య, కొడుకు, కూతురు కలిసి ఒకే ఇంట్లో ఉంటారు. ఎవరికీ పుట్టగొడుగుల సాగుపై ఆసక్తి లేకపోవటంతో అప్పుడేమీ చేయలేక పోయాడు.

**అపజయం అనే రోగాన్ని చంపే ఉత్తమమైన ఔషధం నమ్మకం మరియు శ్రమించి పని చేయటం.**

కంపోస్టు కలపటానికి ఓ చిన్న యంత్రాన్ని కూడా తానే తయారు చేసుకున్నాడు. 2008లో పుట్టగొడుగుల సాగులో వాడే కంపోస్టు ఎరువు తయారు చేయటానికి పనివాళ్ళు దొరకక మొత్తం పంట నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. సరైన సమయంలో దానిని కలియదిప్పి, తడిని అందిస్తూ వుండకపోతే మొత్తం ఎరువంతా నిరుపయోగంగా మారుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో తన అన్నవద్ద కొంత డబ్బును అప్పుగా తీసుకుని కొద్ది వారాలలోనే కంపోస్టు కలియతిప్పటానికి, తగిన సమయంలో తగినంత నీటిని అందించేలా ఒక యంత్రాన్ని రూపొందించాడు. ఇది కరెంటు సహాయంతో పనిచేస్తుంది. ఇందులో తయారైన కంపోస్టు పూర్తిగా తడిగా కాకుండా, అవసరమైనంత మోతాదులోనే పొడి పొడిగా వుంటుంది. 10 హార్స్‌పవర్ మోటారు ఒకటి, 2 హార్స్‌పవర్‌ల మోటరు ఒకటి ఇందులో వాడబడ్డాయి.

200 అడుగుల పొడవు, 4 అడగుల వెడల్పు, 4 అడుగుల ఎత్తుగల ఎరువు కుప్పను ఈ యంత్రం ద్వారా కేవలం 20 నిమిషాల్లో కంపోస్టు ఎరువుగా మార్చుకోవచ్చు. ఈ యంత్ర వాడటం వలన కంపోస్టు త్వరగా తయారు కావటమే గాక, అవసరమైనంత తేమగా మాత్రమే ఉంటుంది. ఇది ఎటువంటి నేలమీదనైనా వాడుకోవచ్చు. కూలీల ఖర్చు, సమయం చాలా ఆదా చేస్తుంది.

ఈ యంత్రం పేటెంటుకై దరఖాస్తు చేయడమైనది. దీనికి ఒక స్టీరింగ్‌ను కూడా ఏర్పాటు చేస పనిలో వున్నాడు. అది తయారైతే ఎరువు కుప్ప వద్దకే యంత్రాన్ని తీసుకువెళ్ళి పని చేసుకోవచ్చు. ఇప్పటికి ఒకే ఒక యంత్రం తయారు చేశాడు. చాలామంది పుట్టగొడుగుల వ్యవసాయదారులు తనవద్దకు వస్తూ వుంటారు. దీని తయారీలో తన సోదరులు ఎంతో సహకరించారని అంటాడు జితేందర్.

దేశంలోని పుట్టగొడుగుల పరిశ్రమకి, ప్రత్యేకించి హర్యానా ప్రాంతానికి ఇతను చేసిన సేవలకుగాను 'సోలన్' లోని 'పుట్టగోడుగుల పరిశోధనా సంస్థ' వారు 'జాతీయ పుట్టగొడుగుల మేళా'లో 2013 సంవత్సరానికి "అభ్యుదయ పుట్టగొడుగుల రైతు" పురస్కారాన్ని అందజేశారు.

**జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి (సాధారణ ఉపయోగకర యంత్రం) :**



**పత్తితో వత్తులు చేసే యంత్రం:**

**విజయ్ భాయ్ సోలంకి, దీపక్ భాయ్ వ్యాస్, అహమ్మదాబాద్, గుజరాత్ :**

దీపాలు వెలిగించడానికి వత్తులు చేయటం అన్నది ప్రతి ఇంట్లో మహిళలు చేసే పని. పొడుగాటి వత్తులు చేయటం కోసం మార్కెట్లో కొన్ని యంత్రాలున్నాయి. 'పువ్వు వత్తులు' (కింద ప్రత్తి గుండుగా వుండి పైన కాడలా వుండేది) చేయటానికి ఏ యంత్రాలు లేవు. విజయ్ భాయ్, దీపక్ భాయ్‌లు ఈ గుండు వత్తులు చేయటానికి ఒక యంత్రాన్ని తయారు చేశారు.

45 సంవత్సరాల విజయ్ భాయ్, పాఠశాల చదువును మధ్యలోనే ఆపివేసి, 'వేరావల్' గ్రామంలో రేడియో మెకానిక్‌గా పనిచేయటం ప్రారంభించాడు. అక్కడ సరియైన ఆదాయం లేకపోవటంతో తన బసను అహమ్మదాబాద్‌కు మార్చాడు. అక్కడ ఒక మెకానిక్ దగ్గర పనిచేస్తూ అదనపు ఆదాయం కోసం మధ్యాహ్నం కార్యాలయాలలో పనిచేసే ఉద్యోగస్తులకు టిఫన్ బాక్సులను సరఫరా చేసేవాడు. అప్పుడే అతనికి రాజ్‌కోట్ నుంచి వచ్చిన 44 సంవత్సరాల దీపక్ భాయ్ సోలంకితో పరిచయం ఏర్పడింది. దీపక్ భాయ్ తన 18వ యేటనుంచే వత్తులు తయారు చేసి అమ్మే వ్యాపారంలో ఉన్నాడు. అతని తండ్రి ఒక ఆయుర్వేద వైద్యుడు. తండ్రికి వున్న 7మంది సంతానంలో 5వవాడు దీపక్ భాయ్. కేవలం చదవటం, రాయటం వచ్చు. భుక్తి గడవటానికి ఉపాధి వెతుక్కుంటూ అహమ్మదాబాద్ చేరుకున్నాడు.

యుక్త వయస్సులో దీపక్ భాయ్ సైకిల్‌మీద తిరుగుతూ వత్తులు అమ్ముకునే ఒకతన్ని చూశాడు. ఆశగా ఆ వ్యాపారపు వివరాలు అడిగి తెలుసుకున్నాడు. సరే అని ఉత్సాహంగా తనే ముడి సరుకును కొని వత్తులు చేసి అమ్మటం ప్రారంభించాడు. కొంతకాలం ఇలా గడిచాక తాను ఒక్కడే చేస్తే తగిన ఆదాయం రాదని గ్రహించి, పరిసరాల్లోని

**నీవు క్రితంసారి చేసిన తప్పే నీకు మంచి పాఠం నేర్పుతుంది.**



మహిళలను ప్రోగు చేసి వారితో వత్తులు తయారు చేయించి, వాటని అమ్మటం ప్రారంభించాడు. కానీ, ఇతనివద్ద శిక్షణ పొంది వత్తులు తయారు చేయటం నేర్చుకున్న మహిళలు వారే తయారు చేసుకుని స్వంతంగా అమ్మటం ప్రారంభించటంతో ఇతని వ్యాపారం కాస్త దెబ్బతినింది. ఇలా కాదని తిరిగి స్వంత ఊరికి వెళ్ళిపోయాడు. అక్కడ తనకు తెలిసిన వాళ్ళవద్ద వత్తులు చేయించి, ఆ వత్తులను ఒక సంచిలో నింపుకొని అహమ్మదాబాద్‌కు వచ్చి అమ్మటం ప్రారంభించాడు. చిల్లరగా అమ్మటం కన్నా, టోకుగా అమ్మితే సమయం కలిసి వస్తుందని అలాగే చేయటం మొదలు పెట్టాడు. పొరుగు రాష్ట్రాలైన రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో కూడా తిరిగి వచ్చాడు.

ఈ వత్తుల వ్యాపారంలో ఇతను గమనించింది ఏమిటంటే అందరూ పొడవుగా వుండే వత్తులే చేస్తున్నారు కానీ, పువ్వు వత్తులు ఎవ్వరూ చేయటం లేదు. కొనేవాళ్ళంతా వాటినే అడుగుతున్నారు. ఎవరైనా చేసేవాళ్ళు ఉన్నారా అని వెతికితే ఎవరికి వాళ్ళు చేసుకువాళ్ళు వున్నారు కానీ, వారుకూడా చాలా కొద్దిమందే ఉన్నారు. తానే ఎందుకు చేయకూడదు అని గుండు వత్తులు చేసి అమ్మటం ప్రారంభించాడు. చాలామంది వాటినే అడుగుతున్నారు. ఎక్కువ ప్రమాణంలో చేయటానికి ఏదైనా యంత్రం ఉంటే బావుంటుందనే ఆలోచన వచ్చింది. ఈ సమయంలోనే అతనికి విజయ్ భాయ్‌తో పరిచయం ఏర్పడింది. అతను మెకానిక్ కనుక తన ఆలోచనను చెప్పాడు. దీన్నొక సవాలుగా తీసుకొని యంత్రం తయారు చేయాలి అనుకున్నాడు. వారి కోరిక ఎంత తీవ్రంగా ఉందంటే విజయ్ భాయ్ ఉద్యోగం మానేసి, పూర్తి సమయం ఈ యంత్రం తయారీకే కేటాయించ సాగాడు. ఉద్యోగం లేదు కనుక అతని కుటుంబాన్ని కూడా దీపక్ భాయ్ పోషించేవాడు.

రోజంతా విజయ్ భాయ్ యంత్రం తయారీ ఆలోచనలో ఉండగా, దీపక్ భాయ్ వత్తులు అమ్మి గుండు వత్తులకున్న గిరాకీ తెలుసుకుని, సాయంత్రం కూర్చుని చర్చించుకునేవాళ్ళు. త్వరగా పనిచేయాలి అనుకునేవాళ్ళు. ఎన్ని ప్రయత్నాలు చేసినా పెద్దగా ఫలితం కనిపించటం లేదు. ఒకరోజు వర్షంలో ఇద్దరూ ఆటోలో ప్రయాణం చేస్తూ వుండగా ఆటో అద్దానికి వైపర్ పనిచేస్తున్న తీరు గమనించి ఈ పద్ధతిలో వత్తులు చేయవచ్చు అన్న ఆలోచన వచ్చింది విజయ్‌కి. ఇద్దరూ చాలా ఉత్సాహంగా పనిని ప్రారంభించారు. కానీ సమస్యల్లా ఇద్దరి దగ్గరా డబ్బులు లేవు. అప్పు చేశారు. సరియైన మార్గదర్శకత్వం లేక ఎంత శ్రమించి పనిచేసినా యంత్రం పూర్తి కాలేదు కానీ, 5 లక్షల అప్పు మిగిలింది. నాలుగు సంవత్సరాలు గడిచిపోయాయి. వాళ్ళు చెప్పినదాని ప్రకారం 100 శాతం కష్టించి పని చేస్తున్నా 10 శాతం ఫలితం కూడా కనిపించటం లేదు. 2012వ సంవత్సరంలో నిరాశకు గురై ఇది మనవల్ల కాదు అని యంత్రం ఆలోచన మానుకున్నారు. వత్తుల వ్యాపారం ఉన్నా, మధ్యాహ్నం టిఫిన్ల వ్యాపారం అస్థిరంగా ఉండటంతో దీపక్ కూడా స్వస్థలానికి వెళ్ళిపోతాను అన్నాడు. సరిగ్గా అదే

**మీ సంతకం ఎప్పుడు మీ ఆటోగ్రాఫ్‌గా మారుతుందో, అప్పుడే మీ జీవితం సార్థకమైనట్లు.**

సమయానికివారికి ఎన్.ఐ.ఎఫ్. వారి 'పశ్చిమ గెయిన్' వారితో పరిచయం ఏర్పడింది. ఆలోచన బాగుంది, యంత్రం పూర్తి కావడానికి తగిన ఆర్థిక, సాంకేతిక సహాయం అందజేస్తామని ముందుకు వచ్చారు. త్వరలోనే యంత్రం తయారైంది.

నిజం చెప్పాలంటే రెండు రకాల యంత్రాలను తయారు చేశారు. ఒకటి పూర్తిగా ఆటోమాటిక్, రెండోది సగం ఆటోమేటిక్.

చేతులతో తయారు చేస్తే నిమిషానికి 8 నుండి 10 వత్తులు తయారు చేయవచ్చు. అదీ పూర్తి నేర్పరి అయిన పనివారైతే. కానీ ఈ యంర్రతం నిమిషానికి 20-25 వత్తులు సునాయాసంగా చేయగలదు. మంచి నాణ్యత గల వత్తులు తయారౌతాయి. ఈ యంత్రం చాలా తేలికగా వుంటుంది. దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకు వెళ్ళవచ్చు. ఖరీదు కూడా తక్కువే. మహిళల ఉపాధి కల్పనకి చాలా ఉపయుక్తంగా వుంటుంది. గ్యాన్ వారి సహాయంతో ఈ యంత్రాన్ని ఇంకా అభివృద్ధి చేసే ప్రక్రియ సాగుతోంది.

వీరిద్దరూ తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవటమే కాకుండా, దాదాపు 100 యంత్రాలు బైటి వ్యక్తులకు విక్రయించారు కూడా. ప్రభుత్వం వారి ఉపాధి కల్పనా పథకంలో భాగంగా మహిళల స్వయం సహాయక బృందాలకు కూడా వీరీ యంత్రాన్ని అందజేశారు.

**జాతీయ స్థాయి ద్వితీయ బహుమతి (ఇంజనీరింగ్) :**

**ఇటుకలు చేసేందుకు బ్లాకులు తయారు చేసే యంత్రం:**

**అర్జున్ భాయ్ యన్. పగ్‌దార్, కేశోడ్, జూనాఘడ్, గుజరాత్**



సాధారణంగా ఇటుకల తయారు చేయడం అన్నది చాలా శ్రమతో కూడుకున్న పని. దీనికి ఎక్కువగా మహిళలని, పిల్లలను వాడుతూ వుంటారు. అర్జున్ భాయ్ ఇటుకలు తయారు చేసే యంత్రాన్ని కనుగొని వారి శ్రమని చాలావరకు తగ్గించాడు. 52 సంవత్సరాల అర్జున్ భాయ్ సంపన్న కుటుంబంలోనే జన్మించాడు. ఈయన తండ్రి ఒక నగర



ప్రముఖ్‌గా వుండి, తన సాంఘిక కార్యకలాపాలతో మంచి పేరు, పలుకుబడి సంపాదించుకున్నాడు. అర్జున్ భాయ్‌కి ఇద్దరు సోదరులు నలుగురు సోదరీ మణులు. ఇతని తల్లి గృహ నిర్మాణ కాంట్రాక్టు పనులు చేసే చిన్న తమ్మునితో వుంటుంది. అర్జున్ భాయ్, అతని చిన్న కొడుకు కలిసి వుంటారు. ఇతని భార్య పెద్ద కొడుకు కుటుంబంతో వుంటుంది. అర్జున్ భాయ్, అతని కొడుకు ఇటుకల వ్యాపారం చేస్తూ వుండగా పెద్ద కొడుకు కాంట్రాక్టు పనులు చేస్తూ వుంటాడు.

చిన్నతనం నుంచి కూడా చదువుమీద పెద్దగా శ్రద్ధ చూపని అర్జున్ భాయ్ ఇటు ఉపాధ్యాయులనుండి, అటు తల్లిదండ్రుల నుండి చివాట్లు తినేవాడు. ఇతనికి బొమ్మలు వేయడం, కవిత్వం రాయడం సరదా. ఎవరి బొమ్మనైనా చిటికెలో వేసేవాడు. తనకు తెలిసిన వాళ్ళందరి బొమ్మలు వేసేవాడు. 12వ తరగతి పాసు కాలేక చదువును వదిలిపెట్టి 1984లో డబ్బాల స్ట్రాపింగ్ (ప్యాక్ చేసేందుకు వినియోగించే) మిషన్‌లు తయారు చేసే వ్యాపారం ప్రారంభించాడు. మొదట్లో వ్యాపారం బాగానే సాగినా, పోటీదారులు పెరగడంతో వ్యాపారం సన్నగిల్లింది. కొంతకాలం అహమ్మదాబాద్ వెళ్ళి అదే వ్యాపారం చేసి, కలిసిరాక తిరిగి తన స్వస్థలానికి వచ్చేశాడు.

2005వ సంవత్సరంలో అర్జున్ భాయ్ ఒక జెసిబి, రెండు ట్రాక్టర్లు కొన్నాడు. వాటితో అరేబియా సముద్ర తీరంలో రాళ్ళు తీసే వ్యాపారం మొదలు పెట్టాడు. ప్రభుత్వం

**నేను 'హ్యాండ్‌సమ్'గా వుండే వ్యక్తిని కాదు కానీ, అవసరమున్న 'సమ్' పీపుల్‌కి నా 'హ్యాండ్' ఇవ్వగలను.**

ఆ కార్యక్రమాన్ని ఆపివేయటంతో ఉద్యోగస్తులు డీజిలు, తదితర పరికరాలు దొంగతనం చేయటం వలన వ్యాపారంలో దెబ్బతిని, తను కొన్న యంత్రాలకి కిస్తు కట్టలేక యంత్రాలను అమ్మే పరిస్థితికి వచ్చాడు. "రోగం కుదరలేదు కానీ, వైద్యం తెలిసింది" అన్నట్లు ఆ వ్యాపారం కలిసి రాలేదు కానీ, హైడ్రాలిక్ యంత్రాలు ఎలా పనిచేస్తాయో తెలుసుకున్నాడు. ఆ పరిజ్ఞానాన్ని తన ఇటుకలు తయారు చేసే యంత్రంలో ఉపయోగించాడు. 2007లో ఇటుకలు తయారు చేసే వ్యాపారం ప్రారంభించాడు. ఆ ప్రక్రియలో ఇసుక, కర్మాగారాల బూడిద (ఫ్లై ఆష్), సున్నము, నీరు కలిపి కాళ్ళతో తొక్కి ఇటుకల తయారీకి ముడిసరుకు తయారు చేయవలసి వుంటుంది. చాలాసార్లు పనివాళ్ళు దొరకక, దొరికినా చాలా వేతనాలు చెల్లించాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో ఈ మిశ్రమాలను కలపటానికి, దానిని ఇటుకలుగా కోయటానికి పనికి వచ్చే ఒక యంత్రాన్ని తయారు చేయాలని పూనుకొని 2009లో దానిని పూర్తి చేయగలిగాడు.

ఈ యంత్రంలో ప్రధానంగా మూడు భాగాలు ఉంటాయి. మొదటిది మిశ్రమాన్ని కలిపే భాగం, రెండవది మిశ్రమాన్ని జారవేసే కన్వేయర్ బెల్టు, మూడవది ఇటుకలుగా తయారు చేసే భాగం. దీని సహాయంతో గంటకి 17 జ 7 జ9 కొలతలుగల ఇటుకలు 40 నుండి 150 వరకు తయారు చేయవచ్చు. దీని సహాయంతో ఇవే కాదు ఏ కొలతలుగల ఇటుకలైనా తయారు చేసుకోవచ్చు. త్వరగా ఇటుకలు చేయటమే కాక, పిల్లలు, మహిళలకు శ్రమను లేకుండా చేశాడు. దాంతో కూలీల ఖర్చు కూడా బాగా తగ్గిపోయింది.

ఇతను తయారు చేసిన మరొక యంత్రం 3 అడుగుల వ్యాసమున్న చెక్క మొద్దులను కూడా సులభంగా పగలగొట్టేస్తుంది. దీనివలన ఎంతో సమయం, శ్రమ ఆదా అవుతుంది.

గుజరాత్ ప్రాంతంలో పక్షులకి గింజలు వేసే అలవాటు విస్తారంగా ఉంది. దీనికై అర్జున్ భాయ్ ఒక పనికిరాని ప్లాస్టిక్ సీసా, ఒక ప్లాస్టిక్ ట్రేలను ఉపయోగించి ఎక్కడైనా అమర్చుకునేందుకు వీలుగా ఒక స్టాండును తయారు చేశాడు. దీనికి అమర్చిన ఒక బాటిల్‌లో గింజలు వేసి వుంటాయి. పక్షులు ఆ బాటిల్‌పైన కనపడుతున్న గింజలను ముక్కుతో కొట్టగానే ఒకటి, రెండు గింజలు ఈ ట్రేలోకి జారుకుంటాయి. వాటిని పక్షులు తింటాయి. దాంతో ఈ ట్రేలో వేసిన గింజలు వృధా కాకుండా, అన్నీ పక్షులే తింటాయి.

ఇంతేకాక ఈయన ఆవు పేడతో వంట చెరుకుగా వాడటానికి వీలుగా పొడుగాటి కర్రలాగా చేశాడు. అలాగే నర్సరీలో ప్లాస్టిక్ బ్యాగులలో మట్టి నింపి మొక్కలు పెంచడానికి ప్రత్యామ్నాయంగా ఆవు పేడతోనే తొట్టెలు తయారు చేసి అందులో మట్టి వేసి మొక్కలు పెంచుతాడు. దాంతో మొక్కలకు ఎరువుగా కూడా ఇవి పనిచేస్తాయి, ప్లాస్టిక్ వాడకం తగ్గిపోతుంది. ప్రజలకి పనికి వచ్చే ఇన్ని వస్తువులు తయారు చేసిన ఈయన సామాజిక ఇన్నోవేటరనే చెప్పుకోవచ్చు.

(వచ్చే సంచికలో మరికొన్ని....)




## 17వ చిన్నశోధయాత్ర

'పల్లెసృజన' నిర్వహిస్తున్న 17వ చిన్నశోధయాత్ర 2016 జనవరి, 8 నుండి 10వ తేది వరకు జరుగుతుంది. పాల్గొనదలచినవారు 'పల్లెసృజన' కార్యాలయం ద్వారా కాని, వెబ్‌సైట్ www.pallesrujana.org ద్వారాగాని మీ పేర్లు నమోదు చేసుకుని ఈ జ్ఞానయాత్రలో పాల్గొన గలరు.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27111959, సెల్ : 9866 00 1678.

కష్టాల సారాంశమే విజయం.



# స్క్రీన్ ప్రింటింగ్‌లో పెయింటింగ్ లాంటి బొమ్మలు ముద్రిస్తున్న ప్రిన్స్ సత్యం

కొన్ని వందల సంవత్సరాల క్రితం ముద్రణ రంగం ఏర్పడింది. ఆధునికత ఎంత పెరుగుతున్నా పాత ముద్రణా పద్ధతులే కొన్నేళ్ళపాటు రాజ్యమేలాయి. కేవలం కొన్ని పదుల సంవత్సరాల క్రితమే ఈ ముద్రణా రంగం 'స్క్రీన్ ప్రింటింగ్' అనే నూతన ఒరవడికి నాంది పలికింది. ఈ స్క్రీన్ ప్రింటింగ్ మొదలైన అనతి కాలంలోనే తనకంటూ ఓ ప్రత్యేకతను సాధించి పెట్టుకుంది. అది సాధించిన అత్యున్నత స్థానమే 'విజిటింగ్ కార్డ్'. ఒక వ్యక్తి హోదాతో పాటు చిరునామాను తెలియజేసే విజిటింగ్ కార్డుకు అత్యున్నత స్థానాన్ని ఆపాదించింది 'స్క్రీన్ ప్రింటింగ్' అనటంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

ఎవరైనా సరే, ఒక మామూలు వ్యక్తి అతని ఇంటి బయట వుండి తన విజిటింగ్ కార్డును ఆ ఇంటి కాపలాదారునితో పంపితే చాలు. ఎంతటి ఉన్నత స్థాయి వ్యక్తి అయినా బయటికి వచ్చి అతన్ని కలవాల్సిన స్థాయికి ఎదిగిందీ విజిటింగ్ కార్డు. ఈ గొప్పతనమంతా ఖచ్చితంగా స్క్రీన్ ప్రింటింగ్‌కే వర్తిస్తుంది. ఆ తర్వాత స్థానం 'లెటర్ ప్యాడ్'లు ఆపాదించుకున్నాయి. ఈ స్క్రీన్ ప్రింటింగ్ ఎంతటి స్థాయికి ఎదిగిందంటే ప్రతి సంస్థలోను విజిటింగ్ కార్డులు, లెటర్ ప్యాడ్‌లు, బిల్లు పుస్తకాలు, రశీదులు లాంటివన్నిటినీ స్క్రీన్ ప్రింటింగ్ చేయిస్తే అదో గొప్ప సంస్థగా పరిగణించే స్థాయికి ఎదిగిందిది. ఆ తర్వాత ముద్రణా రంగాన్ని 'మల్టీకలర్' ప్రింటింగ్ ఆక్రమించడంతో స్క్రీన్ ప్రింటింగ్ కాస్త వెనుకబడ్డట్టు కనిపించినా, కొన్ని ముద్రణలు మాత్రం తప్పనిసరిగా 'స్క్రీన్ ప్రింటింగ్'కే పరిమితమయ్యాయి అనటం నిర్వివాదాంశం.

ఈ కోవలో స్క్రీన్ ప్రింటింగ్ రంగంలో మామూలు వ్యక్తులకన్నా విభిన్నమైన రీతిలో తన ఆలోచనలకు రూపమిచ్చిన వ్యక్తి మన ఇన్నోవేటర్ 'ప్రిన్స్ సత్యం'. గుంటూరు నివాసి అయిన సత్యం స్వతహాగా ఒక ఆర్టిస్టు. తాను చేసే పనిలో ఓ ప్రత్యేకత ఉండాలని కోరుకునే అరుదైన వ్యక్తి ఇతను. స్వతహాగా ఆర్టిస్టు కావటంతో కొత్తగా ఏర్పడ బోయే పలు సంస్థల 'లోగో'లను తానే రూపొందించి, వాటిని బ్రష్‌తో రంగుల్లో గీసి దానికి ఇంకా మెరుగులు పెట్టి స్క్రీన్ ప్రింటింగ్‌లో ముద్రించటంతో అనతి కాలంలోనే ఎంతో పేరున్న సంస్థల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించు కున్నాడు.

**పైదాకా ఎక్కటానికి శక్తి కావాలి. అది హిమాలయాలైనా సరే, నీ వృత్తిలోనైనా సరే.**



అంతటితో ఆగక మామూలు స్క్రీన్ ప్రింటర్లలా ఒక వాక్యం ఓ రంగులో, మరో వాక్యం ఓ రంగులో ముద్రించటం సాధారణమని తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని ఒకే వాక్యాన్ని అనేక రంగుల్లో ముద్రించటం ద్వారా తన పేరుకు తానే పోటీగా తయారయ్యాడు. ఇక స్క్రీన్ ప్రింటింగ్ రంగాన్ని 'మల్టీ కలర్ యంత్రాలు' తుడిచివేసే సమయం ఆసన్నమైందని గుర్తించి దీనికి మళ్ళీ ప్రాణం పోయాలని నిర్ణయించుకున్నాడు సత్యం.

అందమైన మనుషులు, ప్రకృతి సౌందర్యాలను రంగు బొమ్మలుగా వేయాలంటే ఒక ఆర్టిస్టు ఎన్నో రోజులు కష్ట పడాల్సి వస్తుంది. అది కూడా ఒక బొమ్మను మాత్రమే వేయగలడు. మళ్ళీ అదే బొమ్మ వేయాలన్నా మళ్ళీ దాదాపు అన్ని రోజులు కష్టపడ్డా ఆలాగే వెయ్యలేడు. అప్పుడు సత్యం ఆలోచనల్లో ఓ మెరుపు మెరిసింది. ఎంతోమంది ఆర్టిస్టులు, వేసిన బొమ్మలను తదేకంగా గమనించిన సత్యం ఈ బొమ్మను రూపు రేఖలు మార్చకుండా యధాతథంగా ఎన్ని కాపీలనైనా స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా చేస్తే బావుంటుంది కదా అని ఆలోచించాడు.



అప్పటివరకు పరిమితంగా వాడిన స్క్రీన్ ప్రింటింగ్‌తో అనేక రంగులకు ప్రత్యేక స్క్రీన్‌లు తయారు చేసుకుని ఒకే బొమ్మను ఎన్నో వందల కాపీలు ఎటువంటి రూపురేఖలు మారకుండా ఒకేవిధంగా ఉండేలా ముద్రించి ఎంతోమంది ఆర్టిస్టుల ప్రశంసలను అందుకున్నాడు.

సాధారణంగా చిన్న పరిధిలో అంటే విజిటింగ్ కార్డులు, లెటర్ ప్యాడ్‌లు మొదలైనవి తయారు చేయడానికి స్క్రీన్ ప్రింటింగ్‌లో రెండు మహా అయితే మూడు రంగులు వాడుతారు. కానీ, ప్రిన్స్ సత్యం ఈ బొమ్మలను స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా ఇప్పటివరకు అత్యధికంగా 18 రంగులను ఒకే బొమ్మపై వాడటం జరిగింది. అంటే బొమ్మపై జూక రంగు వేసేటప్పుడు రిజిస్ట్రేషన్‌పై ఎంత నిశితంగా ఏర్పాటు చేయాల్సి వుంటుందో..... ఇది ఆయనకే సాధ్యమైందేమో.... ఫలితంగా ఆ బొమ్మ ప్రింటింగ్ చేసినట్లు కాకుండా, బ్రష్షుతో



విద్యార్థులలో ఉండాల్సిన ముఖ్య లక్షణం ప్రశ్నించటం. వాళ్ళకా అవకాశమివ్వండి.





ఆర్టిస్టు గీసిన మాతృక లాగానే కనిపిస్తుంది. ఇది సత్యం సాధించిన ప్రత్యేకత. మామూలుగా ఎంతోమంది జీవనాధారం కోసం వాడే పద్ధతిని ఈయన ఒక ప్రత్యేకమైన 'కళ' స్థాయికి తీసుకు వెళ్ళాడనే చెప్పాలి.

స్వతహాగా మహా నటుడు కీ.శే. శ్రీ నందమూరి తారక రామారావు అభిమాని అవటం చేత ఆయన నటించిన చిత్రాలలోని బొమ్మలతో పాటు అనేక చిత్రాలను కూడా ఈయన తనదైన ప్రత్యేక స్క్రీన్ ప్రింటింగ్ పద్ధతిలో తయారు చేశాడు. ఈ బొమ్మలను చూసి తీరాల్సిందే. గృహాలంకరణకై ఎంతో ఖరీదు పెట్టి కొన్న చిత్రాలలా ఉంటాయి.

త్వరలోనే ఎన్టీఆర్ బొమ్మలతో ఇరు తెలుగు రాష్ట్రాలలో ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేయాలనే తలంపుతో ఆ ప్రయత్నాలలో ఉన్నాడు. తన ప్రక్రియ ఇంతకు ముందు ఎవ్వరూ ఉపయోగించినది, ప్రయోగించిన దాఖలాలు కనపడక పోవటంతో 'గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో కూడా తన పేరు నమోదు చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు సత్యం.

'పల్లెసృజన' బృందం 'సత్యం' వినూత్న పద్ధతిలో చేసే స్క్రీన్ ప్రింటింగ్ గురించి తెలుసుకుని, అతనిని కలిసి అతని కళాఖండాలను పరిశీలించి, ముగ్ధులై ఈ కళ ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా దీనికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకు వచ్చేందుకు తమ శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తామని చెప్పింది.

ప్రిన్స్ సత్యం ఫోన్ నెంబర్ :98664 94696 ●


**ఏదైనా సమస్యకు పరిష్కారం చూపి, ఇతరుల జీవితాలను మెరుగు పరిచి, మీకు బహుమానం సంపాదించి పెట్టగల సాంకేతిక పరమైన ఆలోచన మీవద్ద ఏదైనా ఉన్నదా?**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) – ఇండియా** అహమ్మదాబాద్ సమర్పించు

**ఇగ్నైట్-2016**

**పాఠశాల విద్యార్థులకై స్వంత సాంకేతిక ఆలోచన మరియు ఇన్నోవేషన్ల పోటీ**

దరఖాస్తులు ఆగస్టు 31, 2016 వరకు ఆమోదించబడతాయి.

మీయొక్క లేదా ఇతరుల జీవితాలను లేదా పనిని సులభతరం చేసే కొత్త యంత్రాలు/ పరికరాలు లేదా ఇంతకుముందే వున్న వాటినిసాంకేతికపరంగా అభివృద్ధి చేసే పద్ధతులకై వెతుకుతున్నాం.

ప్రత్యేకంగా వున్న ఇన్నోవేటివ్ ఆలోచనలకి, ఇన్నోవేషన్లకి వీలైతే పేటెంట్ పొందటానికి మరియు వ్యాపార అభివృద్ధి అవకాశాలకి సహాయం అందించటమే కాక, సాంకేతిక, ఆర్థిక సహాయం కూడా అందిస్తాం.

మీవద్ద ఏదైనా సృజనాత్మకమైన ఆలోచన ఉన్నట్లయితే వచ్చి పాల్గొనండి.

**<u>దరఖాస్తులు పంపవలసిన / వివరాలకై సంప్రదించ వలసిన చిరనామా :</u>**

**IGNITE - 16**
National Innovation Foundation - India,
Bungalow, No. 1, Satillite Complex, Prem Chand Nagar Road,
Ahmedabad - 380 015., Gujarat. Ph.: 079-2673 2095, 2673 2456
E-mail : ignite14@nifindia.org, http://nif.org.in/submitidea.php

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27111959, సెల్ : 9866 00 1678
E-mail : president@pallesrujana.org, www.pallesrujana.org

*మీ దరఖాస్తులలో దయచేసి మీ ఆలోచనలు, ఇన్నోవేషన్లు, చిత్రాలు ఉంటే డయాగ్రమ్ (ఉంటే) తో పాటు మీ పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, చదువుతున్న తరగతి, పాఠశాల/ కళాశాల పేరుతో పాటు తప్పక వ్రాసి పంపవలెను.


**ఒక దేశం అవినీతి లేకుండా అందమైన ఆలోచనలు కల మేధస్సుతో నిండి ఉండాలంటే నా గట్టి నమ్మకం అది ముగ్గురే చెయ్యగలరు. ఒకరు అమ్మ, రెండు నాన్న, మూడు గురువు.**



## పల్లెజ్ఞానంతో పదిమందికి లాభం చేసిన

# పందిరి పుల్లారెడ్డి

నాకున్న చిన్నపాటి పొలంలో నేను వ్యవసాయం చేసుకుంటూ, నా కూతుళ్ళను చదివించుకుంటూ నేను, నా భార్యతో కలిసి పొలం పనులు చేసుకుంటూ మా ఊరికే పరిమితమైన నన్ను దాదాపు ఉభయ తెలుగు రాష్ట్రాలకు పరిచయం చేసిన 'పల్లెసృజన'ను నేనెప్పటికీ మరచిపోలేను అంటాడు మన ఇన్నోవేటర్, నల్గొండ జిల్లా మునగాల మండలం లోని ముకుందాపురం గ్రామానికి చెందిన 'పందిరి పుల్లారెడ్డి'

మీ ద్వారా ఉభయ రాష్ట్రాలకు పరిచయం కాగా, మీ ప్రోద్భలంతో 'సాక్షి' దినపత్రికలో నాగురించి వ్రాయడం తో నేను నాకొరకు చేసుకున్న పని ఇంతమంది తెలుగు ప్రజలకు అవసరమైందా అన్న ఆశ్చర్యానికి కూడా గురౌతూ వుంటానప్పుడప్పుడు అంటాడాయన. 'రెండు బోర్లకు ఒకే మోటరు' విధానం తాను తయారు చేసుకున్నప్పుడు 25 అడుగుల దూరంలో గల మరో బోరుబావి నీటిని మొదటి బోరు బావిలోకి సంధానం చేసి విజయ వంతం కావటంతో 'పల్లెసృజన' జనవరి-ఫిబ్రవరి-2014 సంచికలో ఆయన కథను ప్రచురించడం జరిగింది. అందుకు నాటి సంయుక్త రాష్ట్రంలోని దాదాపు ప్రతి జిల్లానుంచి కొన్ని వందల మంది ఫోన్ ద్వారా ఆయనను, పల్లెసృజన కార్యాలయాన్ని సంప్రదించడం జరిగింది. ఇంతటి ప్రతిస్పందనను చూరగొన్న పుల్లారెడ్డి ఇన్నోవేషన్ పట్ల ప్రజలు ఎంత ఆతృతగా ఎదురు చూస్తున్నారో నాడు అర్థమైంది.

నాటినుండి పుల్లారెడ్డి కేవలం తన వ్యవసాయం కోసం పనిచేసుకునే వాడుగా కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా తిరిగి ఎంతోమంది రైతులకు ఈ విధానాన్ని ఏర్పాటు చేయించి దాదాపు అందరి రైతుల మన్ననలు అందుకున్నాడు. దాదాపు సంయుక్త రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రైతుల సోదరుల ఆహ్వానం మేరకు వెళ్ళి వారి పొలం వద్ద వుండి రెండు బోర్లకు ఒక మోటరు విధానాన్ని విజయవంతంగా పూర్తి చేశాడు.

పుల్లారెడ్డి ఈమధ్య తాను చేసిన ఈ రెండు బావులకు ఒకే మోటరు విధానంలో బోరు బావుల మధ్య దూరం 150 అడుగులకు పెరగటం గమనించాల్సిన విషయం. ఇంతవరకు పుల్లారెడ్డి కర్నూలు, కడప, గుంటూరు, అనంతపురం, నల్గొండ జిల్లాలలోని దాదాపు 50 గ్రామాల్లో ఈ రెండు బోర్ల విధానం అమలు చేయగలిగాడు.

ఇంతవరకు తనను పిలిపించుకున్న ప్రతి రైతు నేను వారివద్దకు వచ్చిపోయిన రవాణా ఖర్చులతో పాటు, ఆ రైతు స్థోమతను బట్టి రెండు నుండి మూడువేల వరకు పారితోషికం కూడా ఇవ్వటం జరిగింది అంటాడు పుల్లారెడ్డి. ఈ పారితోషికం కన్నా తనకు ఆనందకరమైన విషయం ఏమిటంటే ఊరు దాటి వెళ్లని నాలాటి ఒక సాధారణ రైతును రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలకు వెళ్ళేలా నా జ్ఞానంతో పదిమందికి మేలు కలిగే పని చేయించడం, దాని ద్వారా నాకు పేరు, జీవితంలో తృప్తిగా ఉండే అవకాశాన్ని కల్పించడం 'పల్లెసృజన' సంస్థకు నేనెంతో ఋణపడి వుంటాను అంటారాయన.

ఒక రైతు తనకోసం చేసుకున్న ఒక పనిని 'పల్లెసృజన'లో ప్రచురించటం ద్వారా ఎంతోమంది రైతులు ఆ జ్ఞానాన్ని తమకు ఉపయోగపడుతుందని తెలుసుకుని అతన్ని పిలిపించుకుని వారి కష్టాలను కూడా దూరం చేసుకోవటం, పల్లెసృజన చేస్తున్న "జ్ఞానవ్యాప్తి"కి ఇంతటి స్పందన లభించడం 'పల్లెసృజన' ఉద్దేశ్యాలను కొంతవరకు సాందించగలిగిందన్న తృప్తినిచ్చింది. పందిరి పుల్లారెడ్డి జ్ఞానాన్ని అవసరమున్న ప్రతి రైతు వినియోగించుకుని తమ వ్యవసాయ కష్టాల నుండి బయట పడి ఆనందంగా వ్యవసాయం చేసుకోవాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'.

**పందిరి పుల్లారెడ్డి ఫోన్ నెం. 7382737833**

**ఒక్కొక్కప్పుడు బడి మానేసి స్నేహితులతో షికారుకెళ్ళడమే మంచిదేమో. ఎందుకంటే ఎదిగాక అనిపిస్తుంది.... నాకొచ్చిన మార్కులలో ఆనందం లేదు, కానీ నా జ్ఞాపకాలలో ఆనందం ఉంది అని.**



'పల్లెసృజన' పరిచయంతో మారిన

# మహిపాల్ చారి జీవన గమనం

(పూరి గుడిసె నుండి రాష్ట్రపతి భవనం వరకు సాగిన ప్రయాణ గాథ)



ఒక మామూలు పేద కుటుంబం నుండి రాష్ట్రపతి పురస్కారం వరకు నడిచిన 'కడవెండి మహిపాల్ చారి' కథ ఈనాటి 'వెలుగుతున్న జీవితాలు'లో చోటు సంపాదించుకుంది.

వరంగల్ జిల్లాకు చెందిన కడివెండి మహిపాల్ చారి తాను 'చేతితో పనిచేసే వ్యవసాయ పనిముట్టు'ను తయారు చేసిన మొదట్లో తనకున్న తెలివితో ఒక సాధనం తయారు చేయాలన్న సంకల్పంతో ఉన్నదంతా ఊడ్చి ఆ పరికరం తయారీకే వినియోగించాడు. అదే తనను మరో ప్రపంచం వైపు నడిపిస్తుందని నమ్మాడు. నాడు తన గ్రామంలోని చాలామంది అతని పనికి ప్రోత్సాహం కూడా అందించలేదు. 'పల్లెసృజన' పరిచయంతో తాను ఊహించిన దానికన్నా తన బ్రతుకుతెరువు మార్గం, మారిపోవటంతో ఆయన ఆనందానికి అవధులు లేకుండా పోయింది. వారి కుటుంబ సభ్యులు ముఖ్యంగా అతని భార్య, పిల్లల పాలిట 'పల్లెసృజన' ఒక దేవాలయంగా మారిపోయింది.



ఇప్పుడు మహిపాల్ చారి స్వంతంగా ఒక పెద్ద మెకానిక్ షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు, అందులోకి అవసరమైన లేత్ మిషన్ యంత్రాలు, వెల్డింగ్ పరికరాలు తన పనికి అవసరమైన ముడిసరుకుతో షెడ్డంతా నిండుగా కనిపిస్తోంది. ఇప్పుడతనికి తీరిక లేనంతగా పనిముట్ల తయారీ ఆర్డర్లు వచ్చి పడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఇన్నోవేషన్లను వ్యాప్తి చేసిన 'పల్లెసృజన'ను జీవితంలో మరచిపోలేనని అంటున్నాడు.

గతంలో తాము బ్రతికిన దీనావస్థ, నేడు అనుభవిస్తున్న శ్రమలోని ఆనందంతో మహిపాల్, అతని భార్య లావణ్యల ముఖాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. మహిపాల్ చారికి రాష్ట్రపతి పురస్కారం వచ్చిందని తెలిసినప్పుడు ఆనందాన్ని తట్టుకోలేక అతను 'సార్ ఢిల్లీకి నా భార్యతో సహా వస్తాను' అన్నప్పుడు 'పల్లెసృజన' బృందం తప్పకుండా తీసుకురా రాష్ట్రపతి భవన్‌లో నీ ఆనందాన్ని ఎల్లప్పుడూ గుర్తు పెట్టుకోవాల్సింది ఆమెనే కదా అని

ప్రేమించటానికి ఈ జీవితకాలం సరిపోదు. మరి ద్వేషించటానికి మనుషులకి సమయం ఎక్కడ్నించి వస్తుందో?







తెలపటంతో ఆమెనుకూడా రాష్ట్రపతి భవన్‌కు తీసుకు వెళ్ళడం జరిగింది. ఒక మామూలు గృహిణిని రాష్ట్రపతి భవన్ వరకు తీసుకు వెళ్ళింది 'పల్లెసృజన' కావచ్చు కానీ, అతనికి ఆ స్థాయిని, నేటి ఆనందాన్ని సమకూర్చింది మాత్రం "కేవలం అతని తెలివే" అని నమ్ముతోంది పల్లెసృజన.

అవార్డును స్వీకరించటంతో అతని ఆలోచన నిలిచిపోలేదు. హైదరాబాద్ లోని ఒక వైజ్ఞానిక సంస్థ పల్లెసృజనను సంప్రదించి, 'తెల్ల కుసుమ' పంట పూర్తయిన తర్వాత ఎండిన పువ్వులను సేకరిస్తే అవి మంచి ఖరీదుకు అమ్ముడు పోతాయి. కానీ, వాటిని సేకరించేందుకు మనవద్ద తగిన పరికరం లేదు. ఇలాంటి పనిచేసే ఒక పరికరాన్ని మీ ఇన్నోవేటర్లతో చేయించగలరా అని అడగటం జరిగింది. దాన్ని సవాలుగా స్వీకరించిన మహిపాల్ చారి తన ఆలోచనతో కేవలం ఒక వారం రోజుల్లో అతి సులువైన ఓ



పరికరాన్ని తయారు చేసి ఆ శాస్త్రవేత్తల ఎదురుగానే దాన్ని ప్రయోగాత్మకంగా చూపించటంతో వారిలో ఆనందం వెల్లివిరిసింది. మేమంతా ఈ పువ్వులను సేకరించేందుకు ఎంతో పెద్ద యంత్రం లాంటిదాన్ని తయారు చేసి తీసుకు వస్తారేమోనని అనుకుంటూ వుంటే మీరేమో ఇంత పెద్ద సమస్యకు అతి చిన్న పరికరంతో పరిష్కారం చూపించారని 'పల్లెసృజన'ను ఇన్నోవేటర్ మహిపాల్ చారిని అభినందనలతో ముంచెత్తారు.

అంతే కాదు. 'శ్రీవరి' పొలంలో కలుపు నియంత్రణ పెద్ద సమస్యగా వుండటంతో ఆ సమస్యకు కూడా ఒక చిన్నపాటి యంత్రాన్ని తయారు చేసి ఎంతోమంది రైతుల మన్ననలు పొందాడు మహిపాల్.

సమాజంలోని వ్యక్తులకు మేము అందిస్తున్న సందేశం ఒక్కటే కుల, మత, ప్రాంత, బీద, సాద, ధనిక వర్గాలతో సంబంధం లేనిది "తెలివి తేటలు" వాటిని సరియైన మార్గంలో నడిపిస్తే ఇలాంటి ప్రతిఫలాలే అందివస్తాయి. అంతేకాదు, సృజనాత్మక శక్తి పేదరికాన్ని కూడా పారద్రోలుతుంది అని దృఢంగా నమ్మే 'పల్లెసృజన' నమ్మకాన్ని నిజం చేసిన మహిపాల్ చారిని హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాం. ఇతని సృజనాత్మకత ఇంకా ఎన్నో కొత్తపుంతలు తొక్కి మరిన్ని ఇన్నోవేషన్లు సమాజానికి అందిస్తుందని కోరుకుందాం. జ్ఞాన ఆధారిత పనులు చేపడితే ఎవ్వరైనా సరే, వారు మారుమూల కుగ్రామాల్లో నివసించేవారైనా వ్యక్తిగతంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగ గలరు అని నిరూపించింది 'పల్లెసృజన'. మనిషికి వున్న జ్ఞానం ఎంతటి ప్రభావ వంతమో 'మహిపాల్ చారి' జీవితం చక్కగా వ్యక్తం చేస్తుంది.

**మహిపాల్ ఫోన్ నెం. : 98669 22168** ●

**చేతకాదని ఎప్పుడూ చేతులెత్తేయకూడదు. సమస్యలు మనల్ని ఓడించనీయకూడదు.**

# 'పల్లెసృజన' ప్రగతి




**మీతో పంచుకుని ఆనందించేందుకు కొన్ని విశేషాలు....**

2014-15 సంవత్సరంలో 'పల్లెసృజన' స్వచ్ఛంద కార్యకర్తలు అందించిన సహకారంతో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని 'పునాది స్థాయి సృజన'లను మీకందించే క్రమంలో జరిగిన కొన్ని ముఖ్య ఘట్టాలను మీతో పంచుకోవటం మాకు ఆనందం కలిగించే విషయం. ఈ ఘట్టాలు సమాజానికి కొంత సమాచారం అందించటంతో పాటు పునాది స్థాయి ఇన్నోవేటర్లకు కొంత ప్రోత్సాహకరంగా వుంటుందని ఆశిస్తున్నాం. ఇక్కడ వివరిస్తున్న సంఘటనలన్నీ పూర్తిగా 'పల్లెసృజన' వాలంటీర్ల విజయాలుగానే మేము భావిస్తున్నాము.

**పునాది స్థాయి ఇన్నోవేటర్లే ......:**

✤ 'పల్లెసృజన' వాలంటీర్లు ఈ సంవత్సరం హృదయాన్ని కదిలించే పని చేశారు. ఐసిఎఆర్ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ పనిముట్ల తయారీదారులు పల్లెసజనను సంప్రదించి, రైతులకు 'తెల్ల కుసుమ' మొక్కలో కుసుమల కంకి పక్వానికి వచ్చిన తర్వాత ఆ కంకిపైన వుండే ఎండిన పుష్పాలను చాకచక్యంగా సేకరించేందకు ఒక సాధనం, శ్రీ వరిలో కలుపు నివారణకు మరో సాధనంలను మీ ఇన్నోవేటర్లతో తయారు చేయించ గలరా అని అడిగారు. మన ఇన్నోవేటర్ మహిపాల్ చారి పై రెండు సమస్యలకు పరిష్కారంగా రెండు వినూత్న పరికరాలను తయారు చేసి, వాటిని ఆ శాస్త్రవేత్తల ఎదుట విజయవంతంగా ప్రదర్శించాడు. ఎంతో పెద్ద పరికరాలు తయారవుతాయని ఊహించుకున్న వారు ఇంత సూక్ష్మ పరికరాలను తయారు చేసిన మహిపాల్ చారి ఇన్నోవేషన్లను చూసి ఆశ్చర్యపోయారు. ఈ అనుభవంతో 'పల్లెసృజన' ఇప్పుడు సమాజంలో ఎవరికి అవసరమైన సమస్యలను తెలియజేసినా వాటి పరిష్కారానికి తగ్గ ఇన్నోవేషన్లను తయారు చేయించటానికి ఇన్నోవేటర్లను ప్రేరేపించేందుకు ఉద్యుక్తమైంది.

**పునాది స్థాయి ఇన్నోవేటర్లపై శాస్త్రవేత్తలు ఓ పుస్తకం ప్రచురించడం :**

✤ 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన గ్రామ శాస్త్రవేత్తల కథలు, వారు అందించిన క్రియాశీలతను గుర్తించి ప్రభుత్వ రంగ సంస్థలైన ఐసిఎఆర్, నారమ్ లు 2014 సంవత్సరంలో "రూరల్ ఇన్నోవేషన్స్ ' గ్రాస్‌రూట్స్" పేరుతో అక్టోబర్ 2014న ఒక పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది. ఇలాంటి గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లు గ్రామీణ సమస్యల పరిష్కారానికై తయారు చేసిన పరికరాలను గురించి వివరించే ఒక పుస్తకం శాస్త్రవేత్తల సమాజంకై ప్రచురించడం ఇదే ప్రథమం.

**పునాది స్థాయి ఇన్నోవేషన్ల పండుగ :**

✤ 2015వ సంవత్సరం పునాది స్థాయి ఇన్నోవేషన్ల ప్రదర్శించే "ఇన్నోవేషన్ల పండుగ" ఢిల్లీలోని 'రాష్ట్రపతి భవన్'లో జరిగింది. ఢిల్లీలో మార్చి 7 నుండి 13వ తేది వరకు జరిగిన ఈ పండుగలో ఈ సంవత్సరం తెలుగు రాష్ట్రాల నుండి 'గోదాసు నర్సింహ, మహిపాల్ చారి, కె. చంద్రశేఖర రావు మరియు ముప్పా కృష్ణమూర్తి'ల "నాలుగు" ప్రదర్శించడం వేలాది మంది సందర్శకులు, జాతీయ స్థాయి నిపుణులు మెచ్చుకోవడం జరిగింది. ఇన్నోవేటర్లు, వారి ఇన్నోవేషన్లు జాతీయ స్థాయి వ్యక్తులతో సంధానం కావడంతో వారికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చింది.

**రాష్ట్రపతి పురస్కారాలు :**

✤ ఉభయ రాష్ట్రాల్లోని ఇద్దరు తెలుగు ఇన్నోవేటర్లయిన కె. చంద్రశేఖర్ తయారు చేసిన 'ఇటుకల తయారీలో ఎటువంటి ఇంధన ఖర్చు లేకుండా కేవలం మానవ శక్తితో అత్యధిక ఇటుకలు తయారు చేసి పరికరాన్ని తయారు చేసినందుకు భారత రాష్ట్రపతి పురష్కారంతో పాటు ఒక లక్ష రూపాయల పారితోషికం లభించింది. కె. మహిపాల్ చారి తయారు చేసిన మనిషి నడిపించే వీడర్ తయారు చేసినందుకు పురస్కారంతో పాటు పదివేల రూపాయల పారితోషికం లభించింది. ముప్పా కృష్ణమూర్తి సృజనాత్మకతతో తయారు చేసిన వరిగడ్డితో చీర, కందువాలతో పాటు మరెన్నో గ్రామీణులు, రైతులు వినియోగించే వస్తువులను తయారు చేయడం. ఆయన ఎన్నో సంవత్సరాలుగా 'తాను తయారు చేసిన కందువాను రాష్ట్రపతికి బహుమతిగా ఇవ్వాలన్న కల'ను 'పల్లెసృజన' ద్వారా నెరవేరడంతో అతని ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

**'సృష్టి' సన్మానం :**

✤ ఈ సంవత్సరం ఖమ్మం జిల్లాకు చెందిన 'దారిపల్లి రామయ్య', మహబూబ్ నగర్ జిల్లాలకు చెందిన 'దామా యాదేశ్వరి' అనే ఇద్దరు సామాన్య వ్యక్తులు ఉత్సుకతతో, సమాజానికి మేలు జరగాలన్న సంకల్పంతో సమాజానికి ఉపయోగ పడే అసామాన్య పని చేసినందుకు 'సృష్టి సమ్మాన్' పేరుతో సత్కరించడం 'పల్లెసృజన' గర్వంగా భావిస్తోంది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 'డా. మషేల్కర్' చేతులమీదుగా 8 మార్చి, 2015న ఈ పురస్కారం అందించబడింది.

**మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి.**
**ప్రోత్సహించండి - పాల్గొనండి - ఆవిష్కరించండి.**

- **బ్రిగేడియర్ పి. గణేశం**, అధ్యక్షులు,
పల్లెసృజన సంఘం.

**లక్ష్యం లేకపోవటం కన్నా పెద్ద నేరం ఏదీ ఉండదు.**

## ఎడిటర్ గారికి,

స్పందన

నమస్కారములు, మొదటి కవర్ పేజీలో వేసే కథ నుండే ఈ పుస్తకం గురించి అర్థమవుతోంది. ఈ పుస్తకంలోని వ్యాసాలు ఎంత ఉన్నతంగా ఉంటాయో అన్నది. నేను కూడా ఒక సన్నకారు రైతునే. మీరు ప్రచురిస్తున్న ఇన్నోవేషన్లను కూస్తుంటే నాకు కూడా ఓ రకమైన ఆనందంతో కూడిన ఈర్ష్య కలుగుతోంది. సామాన్య రైతులు తమ సమస్యలకు ఇంత సులభంగా పరిష్కారాలు కనుగొంటున్నారే, నేను కూడా ఏదైనా ఓ సమస్యకు తప్పక పరిష్కారం కనుగొనాలని అనిపిస్తూ వుంటుంది. ఇదంతా కేవలం ఈ పుస్తకం వల్లనే కలిగింది. నాకుమాత్రం ఈ పత్రిక 'ఓ పాలు త్రాగే పిల్లవాడు' లాంటిది అనిపిస్తుంది. అంటే కల్మషం లేని పత్రిక అని చెప్పటానికి ఆనందిస్తున్నాను. చిన్న పిల్లల నుంచి ముసలి వాళ్ళ వరకు ప్రతి ఒక్కరికి ఉపయోగ పడే పత్రిక అనటంలో అతిశయోక్తి లేదు. కేవలం వ్యవసాయ సమస్యలకు మాత్రమే పరిష్కారం అని ఎంచుకోకుండా సమాజంలోని ప్రతి ఒక్కరి సమస్యలకు ఇందులో సమాధానం ఇస్తూ అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకోవటం ఎంతో అభినందనీయం. మీరు ప్రచురిస్తున్న 'సాంప్రదాయ వైద్యం' కూడా ఎంతో బావుంటోంది. నేను నాటక రంగంలో పనిచేస్తూ వుంటాను. నాకు తారస పడిన ప్రతి ఒక్కరితో ఏదో ఒక సమయంలో 'పల్లెసృజన' గురించి మాట్లాడటం జరుగతూ వుంటుంది. నేనీ పుస్తకానికి 'ఓ పిచ్చి అభిమాని'ని. నేనీ పత్రికను మొట్టమొదటి సారిగా 'వినుకొండ'లో వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ 'తిరుమల రావు' గారివద్దకు ఓ పనిమీద వెళ్ళగా నాకీ పుస్తకాన్ని ఇచ్చారు. నాడు పుస్తకం చూసిన మరుక్షణమే ఈ పత్రికకు చందాను పంపటమైనది. నాటినుండి నేటివరకు ఈ పుస్తకాన్ని తప్పకుండా చదువుతూ వుంటాను. ఇందులో ప్రచురించిన ప్రతి ఇన్నోవేటర్‌ను ప్రత్యక్షంగా వెంటనే ఫోన్ చేసి అభినందిస్తూ వుంటాను. చాలా మందిని కలిశాను కూడా. వారితో మాట్లాడి, అభినందిస్తూ వుంటాను. కొంతమంది ఇన్నోవేటర్లయితే "బాబూ ఈ 'పల్లెసృజన' పత్రికలో మమ్మల్ని గురించి ప్రచురించక ముందు తిండికి కూడా నోచుకునేవాళ్ళం కాదు. ఇప్పుడు నాలుగు వేళ్ళు నోట్లోకి వెళుతున్నాయంటే దానికి కారణం 'పల్లెసృజన' మాత్రమే అన్నవారు కూడా ఉన్నారు. ముఖ్యంగా కర్నూలు జిల్లా ఆత్మకూరుకు చెందిన 'సాంప్రదాయ వైద్యుడు' కరీం గారు అయితే 'నా ప్రధాన వృత్తి మెకానిజం, ప్రవృత్తి వైద్యం' ఏదో జీవితం అలా గడిచిపోతూ వుండేది. ఈ ప్రాంతంలో జరిగిన 'శోధయాత్ర'లో బ్రిగేడియర్ గారిని కలవడం, వారికి నేను, నా మాటలు నచ్చడం, వెంటనే వీరరాఘవ రెడ్డి గారిని 'ఇంటర్‌వ్యూ' గురించి నావద్దకు పంపడం, వారు నా గురించి అద్భుతమైన వ్యాసం వ్రాయటం..... ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వెంట వెంటనే ఎన్నో ఫోన్లు, ఎంతోమంది ప్రత్యక్షంగా కలవడం...... ఇదంతా కేవలం 'పల్లెసృజన' చలవే అని, నిజంగా ఆ మహానుభావుడు నాగురించి ఇంత మంచి ఆర్టికల్ వ్రాయటం మూలంగా నా జీవన మార్గమే మారిపోయింది అంటూ ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తుంటే..... నిజంగా 'పల్లెసృజన' ఎంతమంచి పని చేస్తుందీ అనిపిస్తుంది. నాకు కూడా ఆయన ఎంతో సహకరించి, నాకు అవసరమైన సలహాలు, మందులు ఇవ్వటం జరిగింది. ఇంత మంచి కార్యం చేపట్టిన 'పల్లెసృజన' సంపాదక వర్గానికి, ఇందులో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి నా అభినందనలు". – **జాజి,** నాటకరంగ కళాకారుడు, కృష్ణా జిల్లా. ఫోన్ : 99084 11700

**జాజి గారికి,** మీ అభిమానానికి ఎంతో ధన్యులం. మీలాంటి కళాకారులకు మా పత్రిక నచ్చడం, ఇన్నోవేటర్లను అభినందించటం, వీలైతే వారికి ప్రత్యక్షంగా కలవటం చూస్తుంటే, ప్రజల్లో సమాంతర జ్ఞాన ప్రసరణ మొదలైందన్న విశ్వాసం కల్గుతోంది. మీలాగే ఎంతోమంది ఇన్నోవేటర్లతో నేరుగా సంప్రదించి తమ జ్ఞానాన్ని పంచుకుంటున్నారు. పల్లెసృజనకు కావలసింది ఇదే. ప్రజల జ్ఞానం ప్రజల్లోకి చొచ్చుకు పోవాలి. ప్రతి గ్రామానికి చేరాలి. తమ జ్ఞానధనంతో ప్రజలు ఆర్థిక, సామాజిక గుర్తింపు పొందాలి. ఇదే మా ఉద్దేశ్యం. ఇదే మా గమ్యం. మీ అందరి సహకారంతో త్వరలో మా గమ్యాన్ని చేరుకుంటామని ఆశిస్తున్నాము. మా పత్రికకు ఇంతటి వీరాభిమానులు ఉన్నారన్న ఆనందం మమ్మల్ని మా విద్యుక్త ధర్మం పట్ల పునరంకితులను చేస్తోంది. మీ నాటకరంగ సమాజంలో మా పత్రిక చర్చనీయాంశం కావటం గ్రామీణ శాస్త్రవేత్తలకు ఓ శుభసూచకం. మీ అభినందనలను మనస్ఫూర్తిగా స్వీకరిస్తున్నాం. **– ఎడిటర్.**

## ఎడిటర్ గారికి,


గత సంచికలో మీరు ప్రచురించిన గొప్ప వ్యక్తి 'అబ్దుల్ కలాం' గారి నీతి వాక్యాలు మమ్మల్నెంతో ఆకట్టుకున్నాయి. టీవీల్లో, పత్రికల్లో అక్కడక్కడా ఒకటో రెండో కనిపించే వారి నీతి వాక్యాలను ప్రతి పేజీలో చూడటం మాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇలాంటి సూక్తులు ఎప్పుడో పూర్వం చెప్పిన వ్యక్తుల (వాటిని వారు చెప్పారో లేదో తెలియదు) పేరుతో అక్కడక్కడా కొన్ని పత్రికల్లో ప్రచురించటం చూశాము. మా కళ్ళ ఎదురుగా ఎదిగిన వ్యక్తి కీ.శే. అబ్దుల్ కలాం గారు ఇన్ని సూక్తులు చెప్పడం చూస్తే మాకు చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి సూక్తులను పూర్వం ఎవ్వరో చెప్పినట్లు కాకుండా, ఈ తరం వాళ్లు చూసిన వ్యక్తులు చెప్పిన ఇలాంటి సూక్తులను ప్రచురించినట్లయితే మా పిల్లలకు చెప్పుకోవడానికి ఆనందంగా ఉంటుంది. ఇలాంటి సూక్తులు ప్రచురించినందుకు ధన్యవాదాలు తెలుపుకుంటూ.....

**– పగిడి శ్రీలత,** గార్గేయపురం, కర్నూలు జిల్లా.

**శ్రీలత గారికి,** మీ అభిమానానికి ధన్యవాదములు, 'పల్లెసృజన', నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్లకు స్ఫూర్తినిచ్చిన అబ్దుల్ కలాం గారిని మేమెన్నటికి మరువలేము. వారి జ్ఞాపకాలను మేము మాత్రమే కాకుండా పాఠకులందరూ మననం చేసుకుని, సన్మార్గంలో నడవగలరనే చిన్న ఆశతో వీటిని ప్రచురించాము. మీకు నచ్చినందుకు మేము చేసిన ఈ ప్రయత్నం ఫలించిందనే నమ్ముతున్నాం. **– ఎడిటర్.**

**ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. కానీ ఒక మంచి స్నేహితుడు ఒక గ్రంథాలయంతో సమానం.**

# మన సంస్కృతిలో బియ్యం పాత్ర




భారతీయ సంస్కృతిలోని పర్వదినాలలో బియ్యం పాత్ర మహత్తరమైనది. ప్రత్యేకించి నుదుటిపై తిలకం దిద్దటంలో, బియ్యం గింజలని సాంస్కృతిక, మతాచార ప్రాముఖ్యత వున్న ప్రదేశాల్లో తరచూ చల్లటం కూడా జరుగుతుంది. పూజలలో సరేసరి. మన సంస్కృతిలో బియ్యానికున్న ప్రాముఖ్యత మరే ధాన్యానికీ లేదు. ఎందువలన? గోధుమలకో, మరే రకమైన గింజలకో ఇంత ప్రాముఖ్యత లేదెందుకు? దీనిలో పర్యావరణానికి, సంస్కృతికి ఏమైనా సంబంధం ఉందా?

బియ్యం పడమర, తూర్పు పడమటి ఆసియా ప్రాంతాల్లో భిన్న సంస్కృతుల ఆవిర్భావంలో చాలా ముఖ్యమైన భూమిక పోషించింది. దాదాపుగా క్రీ.పూ. 5000 సంవత్సరంలోనే చైనా ప్రాంతంలోని 'హేమూడు' పరిసరాల్లో జరిపిన త్రవ్వకాల్లో బియ్యం బైట పడ్డాయట! (బ్రే-1986). ఆ కాలంలో రైతులు కేవలం అడవి బియ్యాన్ని సేకరించటమే కాక, వ్యవసాయం చేసి బియ్యాన్ని పండించేవారు. దాని కేంద్ర బిందువు అస్సాం, బర్మా పైభాగం, థాయ్‌లాండ్, దక్షిణ – పడమర చైనా, ఉత్తర వియత్నాంలలో ఉండగా, దాని ఛాయలు ఒరిస్సాలోని జయపూరే, ఉత్తర కొరియా, మధ్యప్రదేశ్‌లలోని కొన్ని ప్రాంతాలలో కూడా కనిపించింది.

సాధారణంగా అతి పేద ప్రాంతాల్లో వర్షాధార పంటగా బియ్యం పండించటం జరుగుతూ వుంటుంది. అటువంటిచోట్ల ఎక్కువ ప్రాంతాల్లో ఒకరేకం బియ్యం పండిస్తారు. మనదేశంలో సాంప్రదాయకంగానే కాక, దైనందిక జీవితాలలో కూడా బియ్యానికి ఎందుకింత ప్రాముఖ్యత వచ్చిందో అన్నది పండితులకి, సంస్కృతిని అభ్యసిస్తున్న విద్యార్థులకి కూడా వీడని ప్రశ్నగానే ఉండిపోయింది. ఇంకే గింజలకీ రాని ప్రాముఖ్యత మనదేశంలో ఒక్క బియ్యానికే ఎందుకు వచ్చిందని మా పాఠకుల నుంచి అభిప్రాయాలు కోరుతున్నాం. మన జీవన విధానానికే సవాలు విసురుతున్న ఈ సాంస్కృతిక ఉప్పెనను మనం ఎలా తెలుసుకోవాలో అన్నదానిపై మీ అభిప్రాయాలు తెలియజేయండి. **(హనీబీ 9(2) - 1918)**

PALLESRUJANA Telugu Bi-monthly 20/- Sept.-Oct.- 2015 RNI No. APTEL 12136/01/01/2011-TC

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే




చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 200/- | 800/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 500/- | 2,000/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 9866 00 1678

E-mail : anchor@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023


Narendra Grafix